విలేకరులు కావలెను
చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 107 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi గురువారం 30 ఏప్రిల్ 2026 • పేజీలు : 8 • వెల 2/-

## నేడు ఎపి టెన్త్ ఫలితాలు విడుదల

### ఎక్స్ వేదికగా వెల్లడించిన మంత్రి లోకేశ్

**అమరావతి,ఏప్రిల్29 (చట్టం న్యూస్):** ఏపీలో పదో తరగతి పరీక్ష ఫలితాలు గురువారం విడుదలకానున్నాయి. ఈ మేరకు విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదలవుతాయని మంత్రి వెల్లడించారు. స్కూల్ లాగిన్ ద్వారా హెడ్ మాస్టర్లు నేరుగా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు తమ ఫలితాలను వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని మంత్రి తెలిపారు. అలాగే మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు 'హాయ్' మెసేజ్ చేసి ఫలితాలను చూడవచ్చున్నారు. లీప్ యాప్ ద్వారా కూడా విద్యార్థులు తమ రిజల్ట్స్‌ను తెలుసుకోవచ్చని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.30 లక్షల మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాశారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పది పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫలితాలు విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేసి చెక్ చేసుకోవచ్చు.

## మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది

### ట్రంప్‌కు బ్రిటన్ రాజు ఛార్లెస్ చురకలు



**వాషింగ్టన్,ఏప్రిల్29 (చట్టం న్యూస్):** బ్రిటిష్ వారు లేకపోతే అమెరికా ప్రజలు ఫ్రెంచ్ మాట్లాడాల్సి వచ్చేదంటూ బ్రిటన్ రాజు ఛార్లెస్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎద్దేవా చేస్తూ చురకలు అంటించారు. మంగళవారం రాత్రి అధ్యక్ష

మిగతా 2వ పేజీలో..

## పాతకొత్తల కలయికతో పలువురికి పదవులు

### తెలుగుదేశం కార్యవర్గ ప్రమాణ కార్యక్రమం

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లోకేశ్



**అమరావతి,ఏప్రిల్29 (చట్టం న్యూస్):** తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధినాయకత్వం పాత, కొత్త నాయకుల కలయికతో కమిటీలను ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. టీడీపీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం విశేషంగా మారింది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని నిజం చేస్తూ, కష్టపడి పని చేసిన నాయకులకు కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో కూడా కొత్త ఉత్సాహం కనిపించేలా టీడీపీ హైకమాండ్ కమిటీలను నియమించింది. సీనియర్ నాయకుల అనుభవాన్ని, జూనియర్ నాయకుల దూకుడును సమపాళ్లలో కలిపి కమిటీలను రూపొందించారు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే మంగళగిరి క్లస్టర్ ఇన్ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి కూడా హైలెట్‌గా నిలిచారు. గతంలో సోషల్ మీడియాలో చురుకుగా పని చేసిన పలువురికి కూడా కొత్త కమిటీల్లో అవకాశం ఇవ్వడం గమనార్హం. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్న

మిగతా 2వ పేజీలో..

## తిరుపతికి తగ్గిన విమాన ప్రయాణాలు

- విమాన ధరలతో ప్రయాణికులక వెనకడుగు
- భక్తులు తగ్గడంతో శ్రీవాణి టిక్కెట్లపై ప్రభావం



**తిరుపతి,ఏప్రిల్29 (చట్టం న్యూస్):** విమాన ప్రయాణ ధరలు తిరులమ భక్తులపై పడింది. గల్ఫ్ యుద్ధంతో భారీగా పెరిగిన విమాన ధరల కారణంగా తిరుపతికి వచ్చే విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఈ ప్రభావం శ్రీవాణి టిక్కెట్లపైనా పడింది. తిరుపతి విమానాశ్రయంలో ఒకటిన్నర నెలలుగా శ్రీవాణి ట్రస్టు

మిగతా 2వ పేజీలో..

# పార్టీ కోసం కష్టపడ్డవారికే పదవులు

- ఎంత సీనియర్ అయినా పట్టించుకోను
- ప్రజలకోసం పాటుపడుతూ.. పార్టీ కోసం కష్టపడాల్సిందే
- దేశంలో అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ టిడిపి
- పార్టీ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు లోకేశ్ విశేష కృషి
- సామాన్య మహిళా కార్యకర్తకు పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించాం
- వచ్చే ఎన్నికల్లో ఇప్పటికన్నా రెట్టింపు ఓట్లు రాబట్టుకునేలా కృషి
- టిడిపి కార్యవర్గ ప్రమాణస్వీకారంలో చంద్రబాబు పిలుపు






**అమరావతి,ఏప్రిల్29 (చట్టం న్యూస్):** తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, రాష్ట్ర పురోగతికి కృషి చేసిన వారికే పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని తెలుగుదేశం అధ్యక్షుడు , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీనియారిటీ ఉంటే పదవులు రావని, సిన్సియార్టీతో పనులు చేసేవారిని ఆదరిస్తామని అన్నారు. తనకు అత్యంత దగ్గర వారైనా కప్పు కాఫీ ఇచ్చి పంపుతానే తప్ప, పార్టీ పదవులు అప్పగించి తప్పు చేయనని స్పష్టం చేశారు. తాను గుడ్డిగా ఎవరికీ బాధ్యతలు అప్పగించనని, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేవారినే ప్రోత్సహిస్తానని చంద్రబాబు నాయుడు తేల్చి చెప్పారు. బలమైన కేడర్ కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. దేశంలో టీడీపీలాగా క్రమశిక్షణ కలిగిన పార్టీ ఎక్కడా లేదని అభిప్రాయపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగాచంద్రబాబు మాట్లాడుతూ..'కార్యకర్తే అధినేత అనే మన సిద్దాంతాన్ని ఆచరణలో చూపిద్దాం. లోకేష్ పార్టీలో ప్రక్షాళన తెచ్చి కార్యకర్తలకు బీమా కల్పించారు. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ మనం బలపడాలి. వచ్చే ఎన్నికల్లో 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ రావాలి. అన్ని సమీకరణలు చూసి కార్యవర్గాన్ని ఎంపిక చేశాం. సీనియారిటీ, సిన్సియారిటీ, కమిట్‌మెంట్ చూసి పదవులకు ఎంపిక చేశాం. 4 దశాబ్దాలుగా కమిటీలను నియమిస్తున్నాం. కానీ, ఇంతవరకు ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదు. సీనియర్లను గౌరవిస్తూ కొత్తవారికి అవకాశం ఇచ్చాం. ఒక మండల పార్టీ నేతను పొలిట్ బ్యూరో మెంబర్‌ను చేశాం. సామాన్య కార్యకర్తలకు పార్టీలో పదవులొచ్చాయి' అని అన్నారు. ఒక్క ఓటమితోనే రాజకీయ పార్టీలు చాపచుట్టేస్తున్నాయి. గెలిచినా.. ఓడినా.. సగర్వంగా ఎగిరే జెండా పసుపు జెండా. 44 ఏళ్లలో అనేక సంక్షోభాలు, సవాళ్లను చూశాం. పసుపు జెండా పౌరుషం

మిగతా 2వ పేజీలో..

## బెంగాల్లో ముగిసిన రెండోదశ పోలింగ్

- 90శాతం దాటిన పోలింగ్
- మరింత పెరిగే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడి
- మళ్లీ తమదే అధికారం అన్న మమతా బెనర్జీ



**కోల్‌కతా,ఏప్రిల్ 29 (చట్టం న్యూస్) :** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ముగిసింది. 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అయితే 6 గంటల లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఈసీ కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. పోలింగ్ సందర్భంగా చెదురుమదురు హింసాత్మక సంఘటనలు చేటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మెరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా మొదలైంది. పలుచోట్ల బిజెపి, టిఎంసి కార్యకర్తలు ఘర్షణలకు దిగారు. అయితే సిఆర్‌పిఎఫ్ పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పెద్దగా ఘర్షణలు చోటు చేసుకోలేదు. ప్రజలు పెద్ద ఎత్తున

మిగతా 2వ పేజీలో..

## ఐదు రాష్ట్రాల్లో విజయంతో హ్యాట్రిక్

- బెంగాల్లో ఓటింగ్ పెరగడం ప్రజల ఉత్సాహానికి సంకేతం
- బెంగాల్లో బిజెపి అధికారంలోకి రాబోతోంది
- మే4న ఫలితాలతో ఇది రూఢీ కానుంది
- గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోడీ



**లక్నో,ఏప్రిల్ 29 (చట్టం న్యూస్):** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, గత ఎన్నికల తరహాలో కాకుండా ఎలాంటి భయాలు లేని వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రజాస్వామ్య పటిష్టతకు ఇది సంకేతమని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రజలంతా ఉత్సాహంతో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మే 4న ఐదు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచి హాట్రిక్ సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హార్దోయిలో 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే'ను ప్రధాని బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బెంగాల్‌లో జరుగుతున్న పోలింగ్‌ను ప్రస్తావించారు. 'బెంగాల్‌లో ప్రస్తుతం రెండో విడత పోలింగ్ జరుగుతోంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నట్టు తెలుస్తోంది. మొదటి విడతలో మాదిరిగానే ప్రజలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్న ఫోటోలు సోషల్

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- మొత్తం 95.1 శాతం ఉత్తీర్ణత
- 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు
- ఫలితాల్లో ములుగు జిల్లా ఫస్ట్..హైదరాబాద్ లాస్ట్



**హైదరాబాద్,ఏప్రిల్29 (చట్టం న్యూస్):** తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు

- 90 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం
- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మిల్లులకు చేరిన 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 29 (చట్టం న్యూస్):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు పక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ

మిగతా 2వ పేజీలో..

# మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది

మొదటి పేజి తరువాయి..
కార్యాలయంలో జరిగిన స్టేట్ డిన్నర్‌లో ఆయన సరదాగా మాట్లాడుతూ.. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా సహాయం చేయకపోతే యూరోపియన్ దేశాల ప్రజలు జర్మన్, జపనీస్ మాట్లాడేవారని ట్రంప్ గతంలో అన్న మాటలను బ్రిటన్ రాజు గుర్తుచేశారు. 'అధ్యక్షా.. అమెరికా లేకపోతే యూరోపియన్ దేశాలు జర్మన్ మాట్లాడేవని మీరు ఇటీవల వ్యాఖ్యానించారు. నేనేం చెబుతున్నానంటే ఒకవేళ మేము లేకపోతే, మీరు ఫ్రెంచ్ మాట్లాడేవారు' అని చార్లెస్ చమత్కరించారు. 250 ఏళ్ల క్రితం అమెరికాకు స్వాతంత్ర్యం రాకముందు.. ఈ దేశంపై పట్టు కోసం బ్రిటన్, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నం గురించి ఆయన ప్రస్తావించారు. లండన్-వాషింగ్టన్ మధ్య ఉన్న ప్రత్యేక సంబంధాన్ని కొనియాడారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. స్టేట్ డిన్నర్‌లో అద్భుతమైన ప్రసంగం చేసినందుకు బ్రిటన్ రాజును అభినందించారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో తమకు మద్దతిచ్చేందుకు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ముందుకు రాకపోవడాన్ని విమర్శించారు.

# బెంగాల్లో ముగిసిన రెండోదశ పోలింగ్

మొదటి పేజి తరువాయి..
తరలివచ్చి ఓటేశారు. ఎండలను సైతం లెక్కచేయకుండా పోలింగ్‌లో పాల్గొన్నారు. కాగా, పోలింగ్ పూర్తయిన వెంటనే టీఎంసీ గెలుపుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం బీజేపీ బెంగాల్‌లో ఓటమి చవిచూడనుందని, మూడింట రెండు వంతుల మెజారిటీతో టీఎంసీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. దీనికి ముందు తాను అభ్యర్థిగా నిలబడిన భవానీపూర్ నియోజకవర్గంలో తన ఓటు హక్కును మమతా బెనర్జీ వినియోగించుకున్నారు. సీఆర్‌పీఎఫ్, కేంద్ర బలగాలపై నిప్పులు చెరిగారు. ఒక్క పోలింగ్ బూత్‌కు కూడా సురక్షితంగా లేదన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లు సీఆర్‌పీఎఫ్ గుప్పిట్లోకి వెళ్లిపోయాయని, ఎక్కడా కూడా రాష్ట్ర పోలీసులు బూత్ వద్ద కనిపించలేదని చెప్పారు. అర్ధరాత్రి నుంచే సీఆర్‌పీఎఫ్ బలగాలు, కేంద్ర పరిశీలకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారని, టీఎంసీ కార్యకర్తల ఇళ్లల్లో చొరబడ్డారని, టార్చర్ పెట్టారని ఆరోపించారు. 1984 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పటికీ ఈ తరహా ప్రజాస్వామ్యం, దౌర్జన్యాలు తానెప్పుడూ చూడలేదన్నారు.

# పాతకొత్తల కలయికతో పలువురికి పదవులు

మొదటి పేజి తరువాయి..

కాలంలోలాగే, ఈసారి కూడా సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కీలక బాధ్యతల్లో కొనసాగు తున్నారు. ఈ కొత్త కార్యవర్గంతో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

**లోకేశ్‌కు పలువురు నేతల అభినందనలు**

తెలుగుదేశం పార్టీలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి నారా లోకేశ్‌ను పలువురు నేతలు కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోని తన ఛాంబర్‌లో లోకేశ్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, వివిధ స్థాయి నాయకులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్ పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు నడిపించాలని నేతలు ఆకాంక్షించారు.
అంతకుముందు.. ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి నారా లోకేశ్ సమక్షంలో కేక్ కట్ చేశారు. శ్రీకృష్ణదేవరాయలకు లోకేశ్ కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుపతికి తగ్గిన విమాన ప్రయాణాలు

మొదటి పేజి తరువాయి..
దాతలకు జారీ చేసే టికెట్లు మిగిలిపోతున్నాయి. రోజూ 40 శాతానికిపైనే టికెట్లు జారీ చేయకుండానే కౌంటర్‌ను మూసివేయాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ రోజూ ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా 800, విమానాశ్రయంలో 200 చొప్పున శ్రీవాణి టికెట్లను జారీ చేస్తోంది. ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం తొమ్మిది గంటలకు విడుదల చేసే 800 టికెట్ల కోటా క్షణాల్లో పూర్తవుతుంటే విమానాశ్రయంలో జారీ చేసే 200 టికెట్లలో సగానికిపైగానే మిగిలిపోతున్నాయి.
గతంలో రోజూ ఉదయం ఏడు గంటల నుంచి హైదరాబాదు నుంచి తిరుపతికి ఐదు విమాన సర్వీసులు నడిచేవి. ఈక్రమంలో మధ్యాహ్నం 11 గంటలకే 200 టికెట్ల కోటా విక్రయాలు పూర్తయ్యేవి. ఇటీవల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. విమాన టికెట్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రయాణికుల రాకపోకలు చాలావరకు తగ్గిపోయిన క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే కొన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. సాధారణంగా శ్రీవాణి టికెట్లు కలిగిన భక్తులకు అదేరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. ఈక్రమంలో రెండు గంటల ముందు అంటే మధ్యాహ్నం రెండు గంటలకు విమానాశ్రయంలోని కౌంటర్‌ను మూసివేస్తున్న క్రమంలో రోజూ 50 నుంచి 100 టికెట్లు మిగిలిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 22వ తేదీ వరకు పరిశీలిస్తే 4,400 టికెట్లు అందుబాటులో ఉంచితే 2,980 విక్రయం కాగా, 1420 మిగిలిపోయాయి. తాజాగా మంగళవారం కూడా 90 టికెట్లు విక్రయం కాగా, 110 టికెట్లు మిగిలిపోయాయి. మామూలుగానే శ్రీవాణి టికెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈక్రమంలో మిగిలిన టికెట్లను ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా కేటాయిస్తే మిగిలిన భక్తులు వినియోగించుకుంటారని, లేదా తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు విపరీతమైన ఒత్తిడి నెలకొంటున్న సమయంలో సిఫార్సులపై కేటాయించినా ఈ టికెట్లు వృథా కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ం

# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

మొదటి పేజి తరువాయి..
ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 8096958096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా స్జబెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

# పార్టీ కోసం కష్టపడ్డవారికే పదవులు

మొదటి పేజి తరువాయి..
ఎప్పుడూ తగ్గలేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో అధికంగా రావాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తే అధినేత అనేది మన సిద్ధాంతం.. ఆచరణలో చేసి చూపించాం అని చంద్రబాబు అన్నారు. తెలుగు జాతి ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీ కొనసాగుతుందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలే అసలు బలం అని పేర్కొన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు ఎప్పుడూ మీసం మెలేస్తారని, ఎవరికీ తలవంచరని అన్నారు. నూతన కమిటీలను ఎన్నో వడపోతలు, వ్యూహాలతో ఏర్పాటు చేశామని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా విధానంగా మార్చుకున్నామని పేర్కొన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని, మహిళా బిల్లుకు పూర్తిగా మద్దతు ఇచ్చామని చెప్పారు. చదువుకున్న వారికి మంత్రి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు చంద్రబాబు.. రామ్మోహన్ నాయుడు, శబరి, రాజేష్ వంటి యువ నాయకులను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని, ట్రైనింగ్ క్లాసులు నుంచి కార్యకర్తల సంక్షేమం వరకు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. రాష్ట్రానికి 20 లక్షల ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో



లోకేష్ కృషి చేస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి రావడానికి లోకేష్ కృషే కారణమని పేర్కొన్నారు. ఆయన సామర్థ్యాన్ని గుర్తించి వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించామని చెప్పారు. అది పదవి కాదని, అత్యున్నత బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో టీడీపీ బలం పెరగాలని, 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే మరింత ఎక్కువ ఓట్లు సాధించాలని పిలుపునిచ్చారు. గతంలో కార్యకర్తలు ఎదుర్కొన్న కష్టాలు తనకు గుర్తున్నాయని అన్నారు టీడీపీ అధినేత చంద్రబాబు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ కేంద్ర సహకారంతో గట్టెక్కిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఒక్కో అడుగు ముందుకు వేస్తూ వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని అన్నారు. నిలిచిపోయిన కేంద్ర పథకాలను పునరుద్ధరించామని, అప్పులను రీషెడ్యూల్ చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ప్రజలకు వాట్సాప్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా సెంటర్ సహా పలు ఐటీ సంస్థలను తీసుకువచ్చి విశాఖపట్నాన్ని టెక్ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ప్రత్యర్థి పార్టీపై కూడా చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పుడు కూడా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి నిధులు వస్తుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు కలిగించడంలో ప్రత్యర్థి పార్టీ ముందుంటుందని విమర్శించారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కుట్రలకు ఇక కాలం చెల్లిందని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ చేస్తున్న విధ్వంసాన్ని అనునిత్యం ప్రజలకు చెప్పాలని అన్నారు. కిల్లింగ్ మనస్తత్వంతో ఉన్న పార్టీకి సంక్షేమం పట్టదని.. అభివృద్ధి అంటే గిట్టదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు తీసుకువస్తుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని.. అయినప్పటికీ ప్రభుత్వంపై విశ్వాసంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. ప్రత్యర్థి పార్టీ కుట్రలకు ఇక కాలం చెల్లిందన్నారు. 'ఓసీడీ అనేది ఓ వ్యాధి.. గొడ్డలి పార్టీకి ఇప్పుడు సీసీడీ వ్యాధి సోకింది. క్రెడిట్ చోరీతో గొడ్డలి పార్టీ అనారోగ్యానికి గురైంది. వీళ్లని ఇలాగే వదిలేస్తే.. దేశానికి స్వాతంత్ర్యం కూడా తామే తెచ్చామని చెబుతారు. ఆపరేషన్ సిందూర్‌కు డ్రోన్లు కూడా ఇచ్చామని గొడ్డలి పార్టీ చెప్పేలా ఉంది. ఫేక్ ప్రచారంతో మనకే అనుమానం వచ్చేలా చేయడంలో గొడ్డలి పార్టీ ముందుంటుందని అంటూ సీఎం చంద్రబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు

మొదటి పేజి తరువాయి..
ఆధ్వర్యంలో 2,623, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు నడుస్తున్నాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 6,500 లారీలను సిద్ధం చేశారు. ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతులకు ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. 3.46 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం ద్వారా 64,779 మంది రైతులకు లబ్ది చేకూరింది. అలాగే, 30,220 మెట్రిక్ టన్నుల సెనగ కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించేందుకు నిరుటి కంటే ఈసారి కేంద్రాల సంఖ్యను పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయింది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో దొడ్డు, సన్న రకాలుగా విభజించి సేకరణ కొనసాగుతోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. అదనంగా, సుమారు 20 కోట్ల గన్నీ సంచులు ముందుగానే నిల్వ ఉంచారు, తద్వారా కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.2031 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా.. ఇప్పటికే దాదాపు రూ.323 కోట్లు రైతులకు చెల్లించారు. వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ధాన్యంతో పాటు రాష్ట్రంలో ఇతర పంటల కొనుగోళ్లు కూడా కొనసాగు తున్నాయి. ఈసారి 43.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాలున్నాయి. ఇప్పటివరకు 3.46 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయి. దాదాపు రూ.830.69 కోట్ల విలువైన కొనుగోళ్లతో 64,779 మంది రైతులు లబ్ది పొందారు. 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సెనగ పంట దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 30,220 మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగింది. దీనివల్ల 15,933 మంది రైతులు లబ్ది పొందారు. పొద్దుతిరుగుడు పంటకు 19,808 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 3,492 మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయింది. 2,512 మంది రైతుల నుంచి కొనుగోళ్లు జరిగాయి. అన్ని జిల్లాల్లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా కొనసాగుతున్నాయి. రైతులకు కనీస మద్దతు ధర అందించటంతో పాటు సౌకర్యవంతమైన సేవలు, తక్షణ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

# ఐదు రాష్ట్రాల్లో విజయంతో హ్యాట్రిక్

మొదటి పేజి తరువాయి..
మీడియాలో కనిపిస్తున్నాయి. గత ఆరేడు దశాబ్దాల్లో ఎవరూ ఊహించని విధంగా భయరహిత వాతావరణంలో ఓటింగ్ జరుగుతోంది. ఓటింగ్ ముగియడానికి మరికొద్ది గంటలే ఉన్నాయి. ప్రజలు ఇదే ఉత్సాహంతో ప్రజాస్వామ్య పండుగలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతున్నాను అని మోదీ అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీజేపీ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ సాధించనుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఫలితాలతో అభివృద్ధి భారత్ సంకల్పానికి మరింత బలం చేకూరనుందని చెప్పారు. 594 కిలోమీటర్ల పొడవైన 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే'ను బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గంగా మాత ఆశీర్వాదంతో ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్ సాకారమైందని అన్నారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వేను యూపీ అభివృద్ధికి కొత్త జీవన రేఖగా ఆయన అభివర్ణించారు. పశ్చిమ బెంగాల్‌లో భారీ ఆధిక్యంతో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, సుమారు 36,230 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం జరిగింది. భారతదేశపు అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టులలో గంగా ఎక్స్‌ప్రెస్‌వే కూడా ఒకటి. ఉత్తరప్రదేశ్‌లో అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్‌వే ఇదే కావటం విశేషం. గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఆరు లైన్ల యాక్సెస్-కంట్రోల్డ్ కారిడార్. 8 లైన్ల వరకు విస్తరించుకునే అవకాశం ఉంది. 12 జిల్లాల గుండా.. మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు ఈ ఎక్స్‌ప్రెస్‌వే విస్తరించి ఉంది. ఇది కేవలం ఒక రహదారిగానే కాకుండా.. పారిశ్రామిక, లాజిస్టిక్స్, అభివృద్ధి కారిడార్‌గా పనిచేయాలనే భారీ లక్ష్యంతో రూపొందించబడింది.
గంగా ఎక్స్‌ప్రెస్‌వేలోని నాలుగు సెక్షన్లలో మూడింటిని అదానీ గ్రూప్ నిర్మించింది. గంగా ఎక్స్‌ప్రెస్‌వే కారణంగా మీరట్, ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ప్రయాణించాలంటే.. 11-12 గంటల సమయం పడుతోంది. గంగా ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం 6 గంటలకు తగ్గుతుంది.

# మొద్దు నిద్ర వీడండి-మామిడి రైతులకు మేలు చేయండి

- **నూజివీడులో ఇంధన కొరత ఇంతింత కాదయా!**
- **ఇంధన సంక్షోభం పై వైఎస్సార్ సీపీ నేతల నిరసన కార్యక్రమాలు**

**నూజివీడు:** నూజివీడులో ఇంధన కొరతపై తక్షణ ప్రక్షాళన చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూజివీడులో ఇంధన సంక్షోభం పై పట్టణ అధ్యక్షుడు శీలం రాము ఆధ్వర్యంలో నియోజకవర్గ నేతలు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి నేతలారా! తక్షణం మొద్దు నిద్ర వీడి నూజివీడు మామిడి రైతులకు మేలు చేయాలని కోరారు. మామిడి,మొక్కజొన్న, రబీ వరి పంటల కోత కాలం కావడం, డీజిల్ పంపిణీ సరిగా లేకపోవడం, మార్కెట్ కు తరలాల్సిన ఫలసాయం ఎక్కడి పంట అక్కడే పొలాల్లో నిలిచి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్ కోసం గంటల తరబడి నిరీక్షించినా, బంకుల్లో డీజిల్ దొరక్క పోవడం రైతన్నలకు శరాఘాతం గా మారిందన్నారు. రోజుకు ఐదారు వందల లారీలతో మార్కెట్ కు తరలే మామిడి, నేడు డీజిల్ కొరతతో తోటల కే పరిమితం అయిందన్నారు. ఇవే పరిస్థితులు ఒక్క వారం రోజులు కొనసాగితే మామిడి రైతాంగానికి ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందు చూపు లేని కూటమి నేతలు దిద్దుబాటు చర్యలు తీసుకోలేక పోయారని, ఇకనైనా మొద్దు నిద్ర వీడి నూజివీడు మామిడి రైతులకు మేలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు,పురపాలక మాజీ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ముసునూరు మండల పార్టీ అధ్యక్షుడు




మూల్పూరి నాగ వల్లేశ్వర రావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవ కుమార్, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు పిళ్ళా చరణ్, మాజీ కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వర రావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో కన్నూరి నిహల్ ఆదిత్య సత్తా చాటాడు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29,( చట్టం బ్యూరో) పదవ తరగతి పరీక్షల ఫలితాలలో, కన్నూరి నిహల్ ఆదిత్య పారమిత విద్యాసంస్థల విద్యార్థి 569 మార్కుల తో ప్రతిభ కనబరిచాడు. ఇందుకు గాను పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం కు తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. తనకు వచ్చిన మార్కులకు గాను, కనిహల్ మాట్లాడుతూ తనకు తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు ధన్యవాదాలు తెలియచేశారు.



# మండలంలో ఎస్ఎస్‌సి ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల ఘన విజయం

**రాయికల్, ఏప్రిల్ 29 చట్టం :** రాయికల్ మండల పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల ఎస్ఎస్‌సి ఫలితాలు అత్యుత్తమంగా నమోదయ్యాయి. విద్యార్థులు ప్రతిభ చాటుతూ మండలానికి మంచి పేరు తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలలలో మొత్తం 491 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 486 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 98.98గా నమోదైంది. వీరిలో అబ్బాయిలు 98.48 శాతం, అమ్మాయిలు 99.56 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 22 హై స్కూళ్లలో 17 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించడం విశేషంగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల టాపర్లలో కొతపల్లి భావన (మోడల్ స్కూల్, ఇటిక్యాల) 569 మార్కులతో ప్రథమ స్థానాన్ని సాధించగా, భూపతిపూర్ జెడ్పిహెచ్ఎస్‌కు చెందిన ఎన్. సంజనా, ఆయేషా మహ్విన్ ఇద్దరూ 568 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలలలోనూ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రగతి హై స్కూల్‌కు చెందిన చిలుక సహస్ర 575 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, అల్లకొండ సాయిరాం 572, బిట్ల శ్రావ్య 571 మార్కులు సాధించారు. అలాగే సాయి అగస్త్యన్, కె. అశ్విత్ తేజలు 571 మార్కులతో ప్రతిభ చాటారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల ఈ విజయంపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కృషి, పట్టుదల, నాణ్యమైన బోధన వల్లే ఈ ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు పేర్కొన్నారు.

# మంత్రి చొరవతో రిక్వెస్ట్ బస్టాప్

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 29 చట్టం ప్రతినిధి :** ఆగిరిపల్లి ఎస్సీ కాలనీ లో సి.ఎస్.ఐ చర్చి ఎదురుగా గౌరవ మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథిగారి చొరవతో ,"తెరిసా డ్వాక్రా" మహిళల బస్సు షెల్టర్ నందు ఏపీఎస్ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయడం జరిగింది .ఈ బస్సు షెల్టర్ 1990 దశలో "తెరిసా డ్వాక్రా" మహిళలలు చేత ఏర్పాటు చేయబడింది ఖజూంతీషి బస్సులు ఆపకుండా వెళ్ళటం వలనూషి మరియు బిసి కాలనీవాసులకు, కాలేజీ స్టూడెంట్స్కు, ఉద్యోగస్తులకు విజయవాడ వెళు ్ళటకు ప్రధాన స్టాప్ అవటం వలన అనేక ఇబ్బందులు పడటం జరిగింది ఈ విషయాన్ని25.3.2026న సర్పంచ్ లక్ష్మీ విక్టర్ బాబు, బాబు జగ్జీవన్ రామ్ యువసేన, దళిత ఉద్యోగస్తులు మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లడం వలన డిపో మేనేజర్ కి ఫోన్ చేసి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయవలసిందిగా చెప్పారు. అందులకు డిపో మేనేజర్ ఆంజనేయులు సారధ్యంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధా రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయడం జరిగింది. మంత్రి సారధి గారికి ఎస్సీ కాలనీవాసులు, జుఇ- సర్పంచ్ లక్ష్మీ విక్టర్ బాబు, జుఇ- ఎంపిటిసి ముల్లంగి శ్రావణ్ కుమార్, టిడిపి ఎస్సీ సెల్ బట్టు మర్తి రవీంద్ర,బట్టుమర్తి రాము యువసేన ప్రధాన కార్యదర్శి &MRPS మండల వర్కింగ్ ప్రెసిడెంట్, బొబ్బర్ల సురేష్‌ఐMRPS మండల అధికార ప్రతినిధి ,తాళ్లూరి తులసి రాంబాబు




(మాజీవార్డ్ మెంబర్), దొండపాటి దినేష్, సామ్యూల్, నారాయణ ,జగ్జీవన్ రామ్ తాళ్లూరి నరేష్, కలపాల సురేష్ vhps, యువసేన తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

# సిద్ధిరాచర్లలో నీటి సమస్య..... గ్రామానికి సత్యసాయి నీరు అదనపు గంటలు సరఫరా..

### ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్..





**నార్పల ఏప్రిల్ 29, (చట్టం) న్యూస్ :** నార్పల మండల సిద్ధరాచర్ల గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉంది అని సిద్రాచార్ల గ్రామంలో 800 అడుగు వరకు బోర్లు వేసిన భూగర్భ జలాలు అడిగింటి పోవడంతో ప్రస్తుతం బోర్లు వేసిన నీరు పడే అవకాశం లేదని జియాలజిస్టులు తెలపడంతో సిద్ధిరాచర్ల గ్రామంలో ప్రస్తుతం సత్యసాయి నీరు ఒక గంట వస్తున్నాయని సత్యసాయి నీటి సరఫరా అధికారులతో మాట్లాడి అదనపు గంటలు సిద్ధిరాచర్ల గ్రామంలో సత్యసాయి నీరు వదిలే విధంగా చర్యలు చేపట్టినట్లు మండల ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్ తెలిపారు.. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండడానికి క్రాస్ కార్యక్రమం ద్వారా చేతిపంపులను మరమ్మత్తులు చేయడం జరుగుతుందని తెలిపారు..

# పది ఫలితాల్లో సత్తా చాటిన ప్యారడైజ్ విద్యార్థులు




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29 ,(చట్టం బ్యూరో) :** పదవ తరగతి ఫలితాలలో రేకుర్తి, కొత్తపల్లి లోని ప్యారడైజ్ విద్యాసంస్థలు సత్తా చాటాయి. ఈ సందర్భంగా విద్య సంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ ఫలితాలలో అత్యున్నమైన ఫలితాలు సాధించారని తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయి ప్రేమ్ 591 సిఫా తమన్న 586 వి అశ్విని 584 సాహితి 584 సుదిష్ట 579 లక్ష్మీప్రసన్న 578 స్ఫూర్తి రెడ్డి 574 నక్షత్ర 574 సానియా 573 జాబితా 570 శ్రీదేవి 570 రాష్ట్రస్థాయి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంతటి విజయానికి కృషి చేసిన విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## పది ఫలితాల మండల టాపర్లు




**కొడిమ్యాల, ఏప్రిల్ 29(చట్టం) :** బుధవారం వెలువడిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కొడిమ్యాల విద్యార్థినిలు జి.అక్షయ 558, బి.అక్షయ 556 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో శ్రీ విద్యాభారతి హైస్కూల్ కొడిమ్యాల విద్యార్థిని అజ్మ అఫ్షిన్ 573 మార్కులు, వాసవి హైస్కూల్ నాచుపల్లి విద్యార్థి జి.అనుదీప్ 567 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారు.

## పదో తరగతి ఫలితాలలో మండల టాపర్ గా నిలిచిన నామాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అక్షిత.

**పెగడపల్లి ఏప్రిల్ 29 (చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నామాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న దండ వేణి అక్షిత బుధవారం రోజున వెలువడిన పది ఫలితాలలో 537 మార్కులతో మండల టాపర్ గా నిలిచిందని మండల విద్యాధికారి సులోచన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అక్షితను గ్రామ సర్పంచ్ చిర్ర రజిత- రమణాకర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రం లో విద్యాధికారి సులోచన అక్షితను శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని అన్నారు. అక్షితను గ్రామస్తులు స్నేహితులు,,పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎనగందుల విష్ణు వార్డు సభ్యులు ఆడెపు శ్రీనివాస్, ఏ ఏ పీ సి చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## పదో తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు.




**పెగడపల్లి, ఏప్రిల్ 29 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని 232 మంది విద్యార్థులకు గాను 229 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగింది..113 మంది బాలురలో 110 మంది, 119 మంది బాలికలకు గాను 119 మంది ఉత్తీర్ణత సాధించడం జరిగింది. మండల స్థాయిలో జడ్పీహెచ్ఎస్ నామాపూర్ స్కూలుకు చెందిన డి అక్షిత,537 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది.రెండవ స్థానంలో కే దినేష్, జడ్పీహెచ్ఎస్ సుద్దపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థి 531 మార్కులు సాధించడం జరిగింది.. పెగడపల్లి మండలం మొత్తం ఉత్తీర్ణత శాతం 98.71 గా నమోదయిందని ఈ సందర్భంగా మండల తాసిల్దార్ సయ్యద్ నిజాముద్దీన్ మండల విద్యాధికారి సులోచన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా సాలవుతో సత్కరించారు.

# కాలయాపన చేయకుండా రైతుల నుండి వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

### టి ఆర్ పి జిల్లా అధ్యక్షుడు పాపన్న



**పెగడపల్లి ఏప్రిల్ 29( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో ఐకెపి, ఫ్యాక్స్ ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు పోసిన వరి ధాన్యాన్ని వెంటనే తూకం చేయాలని బీసీ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు పాపన్న,, మండల అధ్యక్షుడు మధుకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో పోసి 20 రోజులు గడుస్తున్న తూకం చేయడం లేదని అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలలో పోసిన వరి ధాన్యాన్ని తూకం చేసి వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు.రైతులు వాతావరణంలో వస్తున్న మార్పులను చూసి, వాతావరణ శాఖ ద్వారా వర్షాలు పడతాయని వినిపిస్తున్న వార్తలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ రాజ్యాధికార పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పంచాయితీ అధికారులకు పదోన్నతులు

### తెలంగాణ సర్కార్ పచ్చజెండా

హైదరాబాద్,ఏప్రిల్ 29 : తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ అధికారుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు తెలంగాణ సర్కార్ పచ్చ జెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలకు 60:40 నిష్పత్తిలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. జిల్లా స్థాయిలో రొటేషన్ పద్ధతిలో ఈ ప్రక్రియ సాగనుంది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 12 నుంచి అమలులోకి రానున్నాయి. దీనివల్ల వేలమంది అధికారులకు లబ్ధి చేకూరడమే కాకుండా, గ్రామాల్లో పాలన మరింత పటిష్టం కానుంది. అధికారులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# వెంగళాయిపేట గ్రామంలో చలివేంద్ర ప్రారంభించిన సర్పంచ్ గోపాల్.



**పెగడపల్లి, ఏప్రిల్ 29( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా మేడపల్లి మండల పరిధిలోని వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వెంగళాయిపేట గ్రామంలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మోకెనపెల్లి గోపాల్ గారు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ఒక మంచి సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రయాణికులు వృద్ధులు పిల్లలు అందరూ చల్లని నీరు తాగి ఉపశమనం పొందుతారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంచె రాజేందర్, కార్యదర్శి కిరణ్ బాబు, మాజీ ప్రజా ప్రతినిధులు, సింగిల్ విండో సభ్యులు తోట మల్లేశం, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టిడిపి గ్రామ నాయకుడు చంద్ర శేఖర్ రెడ్డి మృతి ఆ గ్రామ టిడిపి పార్టీకి తీరని లోటు

### శిశీగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ప్రతినిధి అలం నరసానాయుడు...

**నార్పల ఏప్రిల్ 29, (చట్టం) న్యూస్ :** నార్పల మండలం కేసేపల్లి గ్రామానికి చెందిన టిడిపి గ్రామ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరం తెలుగుదేశం పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేసే వ్యక్తి చంద్రశేఖర్ రెడ్డి ఈరోజు మృతి చెందాడు అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు అని శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు అన్నారు.పార్టీ పుట్టినప్పటి నుండి కేసెపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశాడన్నారు. టిడిపి పార్టీ కోసం కష్ట పడే పనిచేసే మంచి వ్యక్తి కోల్పోయాం అని అన్నారు. శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు అందుబాటులో లేకపోవడంతో వారి కుమారుడునితో ఫోన్లో మాట్లాడి వ్యక్తి గతంగా మేము మరియు తెలుగుదేశం పార్టీ తరుపున అండగా ఉంటామని తెలియజేశారు.

## పదవ తరగతి ఫలితాలలో రేకుర్తిలోని విజన్ హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29,( చట్టం బ్యూరో) :** ప్రకటించిన రాజ ఫలితాలలో రేకుర్తిలోని విజన్ హై స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం పట్ల స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు . అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులలో రాళ్ల బండ అక్షిత 583, మేడిశెట్టి నందిని 572, నాంపల్లి శ్రావ్య 568 , గుర్రం రిషి 560 , స్వాతి శ్రీ వైష్ణవి 556; చిరుత కీర్తన 555 లాంటి మార్కులతో పాటుగా మరెన్నో అత్యుత్తమ మార్కులు సాధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలియజేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా ఈ రిజల్ట్ సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ స్పందనవేణి



# సామాజిక చైతన్య స్ఫూర్తి.....శ్రీశ్రీ !



కవులు ఎల్లప్పుడూ సమాజాన్ని మేల్కొలుపుతూనే ఉంటారు. సమాజ రుగ్మతలను ప్రశ్నిస్తూనే ఉంటారు. ప్రజలను చైతన్యం చేస్తూనే ఉంటారు. ఇలా ఎందరో తమ రచనల ద్వారా...సమాజహితం కోసం కవిత్వాన్ని రాస్తూ వస్తున్నారు. కాలమేదైనా తమకు అనుభవంలోకి వచ్చిన విషయాలను గమనించి వారు ఆయా కాలాల్లో ప్రజా చైతన్య దీపికలుగా వెలుగొందారు. అలాంటి వారిలో శ్రీరంగం శ్రీనివాసరావు ముందుంటారు. ఆయననే మనం శ్రీశ్రీగా పిలుచుకుంటాం. పాడవోయి భారతీయుడా అని శ్రీశ్రీ రాసిన ఓ సినిమా పాటలో స్వాతంత్ర్యం వచ్చెనని, సభలో పెట్టి, సంబరపడిపోకు అంటారు. అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు.. నిరుద్యోగ సమస్య ఇలా అన్నింటిని కలగలిపి రాసిన ఆ పాట నేటికి స్ఫూర్తి దాయకం. నిజంగా నేటికీ అది నిత్య నూతనం. కాలం మారింది. పాలకులు మారారు. కానీ పరిస్థితులు మారలేదు. ఇవన్నీ కూడా ముందే ఊహించి రాసిన మహాస్రష్ట మన శ్రీశ్రీ. తొలినాళ్లలో సంప్రదాయ ఛందస్సుతో భక్తి గీతాలు రాసినా, వెండితెరపై భావుకత పండించే సినీ గీతాలు రచించినా.. ఆయన అసలు సిసలు రూపం మాత్రం సామాజిక చైతన్యం లోనే ఆవిష్కృతమైంది. తాను జీవించిన కాలం నాటి సమాజ అవసరాలకు, మార్పులకు అనుగుణంగా స్పందిస్తూ, తన కలాన్ని అభ్యుదయ పదం వైపు మళ్ళించిన తీరు సాటిలేనిది. మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు, అందరి ప్రీతిపాత్రమైన 'శ్రీ శ్రీ' జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం మన కర్తవ్యం. 1910 ఎప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించిన శ్రీ శ్రీ, తన అక్షరాలతో తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపించిన విప్లవ కవి, హేతువాది, అభ్యుదయవాది. ఆయన రచనలు సామాన్యుడి జీవన సమస్యలను, సమాజంలోని అసమానతలను, అణచివేతలను ప్రతిబింబించి, చైతన్యాన్ని రగిల్చాయి. శ్రీ శ్రీ సాహిత్యం తెలుగు కవిత్వంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి, సామాన్యుడి భాషలో, సమాజ సమస్యలను చర్చించే అభ్యుదయ కవిత్వానికి శ్రీ శ్రీ బాటలు వేశారు. ఆయన అత్యంత ప్రసిద్ధ రచన మహాప్రస్థానం (1950) తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచింది. మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది! పదండి ముందుకు, పదండి త్రోసుకు! అంటూ కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలను ఉత్తేజపరిచే ఈ కవితా సంపుటి, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని 'మహాప్రస్థానానికి ముందు, మహాప్రస్థానానికి తర్వాత' అని విభజించేలా చేసింది. శ్రీ శ్రీ కేవలం కవిగా మాత్రమే కాక, తెలుగు సినిమా పాటల రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. అల్లూరి సీతారామరాజు సినిమాలో తెలుగు వీర లేవరా, దీక్ష బూని సాగర అనే పాట తెలుగు సినిమా పాటకు జాతీయ స్థాయి గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ప్రాస, శ్లేష, అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీ శ్రీ మేటి. ఆయన పాటలు సందర్భానుసారంగా ఆలోచనను రేకెత్తించేలా ఉంటాయి. శ్రీ శ్రీ ఒక హేతువాది, నాస్తికుడు, అభ్యుదయ వాది. ఆయన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా సామాజిక మార్పుకు కృషి చేశారు. 1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరఫున ప్రచారం చేసిన శ్రీ శ్రీ, 1969లో తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యవాదాన్ని సమర్థిస్తూ ప్రదర్శనలు చేశారు. వ్యక్తికి బహువచనం శక్తి అనే ఆయన వాక్యం సమాజంలో చైతన్యాన్ని నింపింది. రాజవీధుల్లో, పండితుల చర్చాగోష్ఠుల్లో, రాజదర్బారుల్లో మాత్రమే వెలుగొందిన తెలుగు సాహిత్యాన్ని సామాన్యుడి చెంతకు తీసుకొచ్చిన మహాకవి శ్రీ శ్రీ అని చెప్పనక్కర్లేదు. నాదొక స్వర్గం! అనర్గళం, అనితర సాధ్యం, నా మార్గం! అంటూ ఆయన చాటిన ఆత్మవిశ్వాసం, తెలుగు జనాన్ని చైతన్యవంతులను చేస్తోంది. ఆయన కవితలు పరుగులు పెడతాయి, సూదుల్లా గుచ్చుకుంటాయి, ఆలోచనను రేకెత్తిస్తాయి. ఆయన సాహిత్య ప్రస్థానాన్ని, బహుముఖీన వ్యక్తిత్వాన్ని ప్రముఖ సినీ కవి వేటూరి శ్రీశ్రీ పుట్టుకతో మనిషి, వృద్ధాప్యంలో మహర్షి, మధ్యలోనే కవి, ఎప్పటికీ ప్రవక్త అన్న వేటూరి మాటలు శ్రీశ్రీ జీవిత కాలక్రమానికి నిలువుటద్దం. సాహితీ లోకంలో ఎన్నో మార్పుల గాలులు వీయవచ్చు, సిద్ధాంతాల తుఫానులు చెలరేగవచ్చు, కానీ శ్రీశ్రీ అనే మహాకవి సష్టించిన అభ్యుదయ భావజాలం అనే సంతకాన్ని ఏ గాలీ చెరిపేయలేదని, దానికి కాలమే కాపలాగా నిలుస్తుందని గుర్తించాలి. శ్రీశ్రీ దృష్టిలో కవిత్వం అంటే కేవలం పదాల పొందిక కాదు. అది ఒక సామాజిక బాధ్యత. కవితా ఓ కవితా! నీ వెలుగుల వెంట పరుగెత్తుతా!' అని పాడుకున్నా, ఆ వెలుగును ఆయన సామాన్యుడి గుడిసెలో వెతకడానికే ప్రయత్నించారు. భావ కవిత్వపు సుకుమారత్వం నుండి 'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' అనే గర్జన వైపు సాగిన ఆయన ప్రయాణం ఒక చారిత్రక అవసరం. 'కాయకష్టం చేసేవాడికి, చెమట చుక్కలు చిందించేవాడికి నా కవిత్వం అంకితం' అని ప్రకటించి నప్పుడు, ఆయన కేవలం ఒక కవిగా కాకుండా సామాజిక విప్లవకారుడిగా అవతరించారు. కుల మతాల చట్రంలో ఇరుక్కుపోయిన సమాజానికి ఆయన అక్షరాలు ఒక శస్త్రచికిత్స వంటివి. 'జగన్నాథ రథచక్రాల్ వస్తున్నాయ్ వస్తుస్తున్నాయ్ పతితులార భ్రష్టులార బాధాసర్పదష్టులార' అంటూ ఆయన ఇచ్చిన పిలుపు సామాన్యుడి గుండెల్లో ఒక ధైర్యాన్ని నింపింది. ఒక కవిగా ఆయన తన సౌందర్యారాధనను కూడా శ్రమలో వెతుక్కున్నారు. అందుకే శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదు అంటూ శ్రామికుడి చెమట చుక్కలో ప్రపంచాన్ని చూశారు. అలాగే యువతను చైతన్య పరచడంలో శ్రీశ్రీ శైలి అనన్యం. సోమరితనాన్ని నిరసిస్తూ ఆయన చేసిన హెచ్చరిక ఇప్పటికీ మార్మోగుతూనే ఉంటుంది. ఎముకలు కుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులారా చావండి.. నెత్తురు మండే, శక్తులు నిండే సైనికులారా రారండి! అని పిలుపునిచ్చినప్పుడు, ఆయనలోని ప్రవక్త స్పష్టంగా కనిపిస్తారు. గాలి ఎటు వీచినా, కాలం ఎటు మళ్లినా తన నిబద్ధతను మార్చుకోని ఆ అక్షర యోధుడు, నిప్పులు కురిపించే కన్నులతోనే వెన్నెల లాంటి స్వచ్ఛమైన అభ్యుదయాన్ని కలగన్నారు. కాలం మారుతున్నా, లోకం కొత్త పుంతలు తొక్కుతున్నా, తెలుగువాడి గుండె చప్పుడై వినిపించే శ్రీశ్రీ సంతకం అక్షర సత్యమై నిలిచి ఉంటుంది. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అని ప్రకటించిన ఆ మహనీయుడు, తన రచనల ద్వారా సామాన్యుడికి ఆత్మగౌరవాన్ని ప్రసాదించారు.

## సిద్ధార్థ విద్యార్థుల విజయ దుందుభి



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29,( చట్టం బ్యూరో) ;** కరీంనగర్ లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల ఫలితాలలో విజయదుందుభి మోగించారు. 452 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించి 592 మార్కులతో కె. విశ్వక్సేన్ జిల్లా టాపర్గా నిలిచి ప్రభంజనం సృష్టించాడు. 570 మార్కులకు పైగా 31 మంది విద్యార్థులు, 560 మార్కులకు పైగా 74 మంది విద్యార్థులు, మరియు 550 పైగా 122 మంది విద్యార్థులు మార్కులు సాధించి సిద్ధార్థ కీర్తి పతాకాన్ని గగన వీధుల్లో మరోసారి ఎగురవేశారు. సిద్ధార్థ 30 సంవత్సరాల ప్రస్థానంలో ప్రతీ నలుగురు విద్యార్థులకు ఒక్క విద్యార్థి చొప్పున 550 పైగా మార్కులు సాధించడం గర్వకారణం. అంతేకాకుండా ఐ.ఐ.టి, నీట్ విభాగాలలో సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ముందంజలో ఉండడం విశేషనీయం. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను అభినందించి, హర్షం ప్రకటించారు. ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అధిరోహించి, కన్న తల్లిదండ్రులకు, విద్యనేర్చిన పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొనిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి , డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డి , ఉపాధ్యాయబృందం, మరియు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# తండ్రికి విలువ ఇవ్వని కవిత అమ్మ ఎలా అవుతుంది

- అన్నమీద కోపంతో తండ్రిని తిడితే ఎలా
- ఎంతయినా కెసిఆర్ ఉద్యమకారుడు కదా
- కెసిఆర్ లేకుంటే కవిత ఎక్కడ ఉండేవారు
- లిక్కర్ కేసులో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదు
- తనకు పదవి ఇస్తే మరింత బాగా పనిచేస్తా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

యాదాద్రిభువనగిరి, ఏప్రిల్ 29 : తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. ఈ మేరకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవితపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కవిత పార్టీ పెట్టడం.. అది కూడా టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదమన్నారు. కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైందన్నారు. మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు, రాజకీయ చర్యలపై స్పందిస్తూ ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ ఏర్పాటు విషయాన్ని రాజగోపాల్ రెడ్డి 'బిగ్ జోక్'గా అభివర్ణించారు. అదే విధంగా టిఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టడం మరో జోక్ అని వ్యాఖ్యానించారు. కవితకు ఉన్న గుర్తింపు కేవలం ఒక ఉద్యమకారుడు బిడ్డగా మాత్రమేనని, ఆమె స్వతంత్ర రాజకీయ నాయకత్వం ఇంకా నిరూపించుకోలేదని అన్నారు. మొదటి సమావేశంలోనే తన తండ్రి అయిన కేసీఆర్‌ను విమర్శించడం సరైంది కాదని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తండ్రిపై గౌరవం, ప్రేమ ఉండాలని, అలాంటి విలువలు లేకపోతే ఆమె వ్యక్తిత్వం ప్రశ్నార్థకమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందిఅంటూ ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కవిత అన్నపై ఉన్న కోపాన్ని తండ్రిపై చూపడం సరికాదని అన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయ వేదికపైకి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఆయన సూచించారు. కవితపై ఉన్న మద్యం కుంభకోణం ఆరోపణల విషయమై.. ఆమెకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, నిర్దోషి అని తేలలేదని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం డబ్బులు ఉన్నాయనే కారణంతో పార్టీ పెట్టడం అంత సులువు కాదని, అది పాన్ షాప్ పెట్టినంత ఈజీ కాదని వ్యాఖ్యానించారు. తనంతట తాను పోటీ చేసినా కవితకు డిపాజిట్ కూడా రాదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఇక తన రాజకీయ భవిష్యత్తుపై మాట్లాడుతూ, అధిష్టానం తనకు పెద్ద పదవి ఇస్తే ఆ బాధ్యతను న్యాయంగా నిర్వహిస్తానని తెలిపారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ

- హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణ
- పర్యాటక కేంద్రాల్లో వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు
- పర్యాటకశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి



హైదరాబాద్,ఏప్రిల్ 29 : రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని ఉన్నతాధికారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చేందుకు పలు అంశాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చించారు. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరిలో నవంబర్ లేదా డిసెంబర్‌లో వీటిని నిర్వహించేందుకు ప్లాన్ చేయాలని సూచించారు. రాష్ట్రంలోని కీలక పర్యాటక కేంద్రాల్లో వారాంతంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. సోమశిల, రామప్ప, యాదాద్రి ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గోల్కొండ, తారామతి బరాదరిలలో జరుగుతున్న పనులపై ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షించారు. పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల ఏర్పాట్లపై రాజీ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. రహదారి పక్కన విశ్రాంతి కేంద్రాలు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రతి టూరిజం ప్రాజెక్ట్‌కు నోడల్ అధికారులను నియమించాలన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగరాన్ని సుందరీకరిస్తామని తెలిపారు. స్కైవాక్‌లు, శిల్పాలతో హైదరాబాద్‌కు కొత్త ఆకర్షణ తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

తెలంగాణను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మధ్య ప్రాచ్య దేశాల్లో తెలంగాణ టూరిజంపై ప్రచారం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. చైనా, వియత్నాం టూరిజం మోడళ్ల గురించి అధ్యయన యాత్రలపై ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వరంగల్, సోమశిలలో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్ల ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి జూపల్లి చెప్పారు. రామప్ప దేవాలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వసంత్ వ్యాలీ ప్రభంజనం



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ హనుమాన్ నగర్ లోని వసంత్ వ్యాలీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు, బి, రామ్ చరణ్ 578 మార్కు సాధించగా,వి, వర్షిత 574 మార్కులు సాధించారు, ఏం సౌమ్య 570 మార్కులు సాధించారు, టి రమ్యశ్రీ 570 మార్కులు రాగా, కే ,రిత్విక 570 మార్కులు సాధించి ప్రభంజనం సూచించారు,5 గురు విద్యార్థులకు 570 మార్కులు పైబడి రాగా, 550 మార్కులు ల పైబడి 15 మంది విద్యార్థులు సాధించారు, 70 మంది విద్యార్థులకు 500 మార్కులు సాధించి జిల్లాలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు,వంద శాతం విద్యార్థులు ఫలితాలు సాధించడంతో వసంత్ వ్యాలీ పాఠశాల చైర్మన్ ఏ, బుచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు,

## పదో తరగతి ఫలితాల్లో వేదం విద్యార్థుల ఘన విజయం

**588/600 మార్కులతో రాష్ట్రస్థాయి ప్రతిభ ;**




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29,( చట్టం బ్యూరో) :** స్థానిక రాంనగర్‌లోని వేదం ఉన్నత పాఠశాల విద్యార్థులు 2026 పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. కొత్తపల్లి లాస్య 600లో 588 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాన్ని నమోదు చేసింది.

అదే విధంగా 500కు పైగా మార్కులు 8 మంది విద్యార్థులు (ఎం. సాహితి, ఆర్. శ్రీహిత, ఎస్. శరణ్య, జి. జయంత్, కె. సాయి శివాని, ఎన్. రిషిక్ ప్రసాద్, ఎన్. నిక్షిత్ తదితరులు) సాధించగా, 400కు పైగా మార్కులు 14 మంది విద్యార్థులు పొందారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రణాళికాబద్ధమైన బోధన, నిరంతర పరీక్షలు, మోటివేషనల్ క్లాసులతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించామని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. తక్కువ ఫీజులతోనే అత్యుత్తమ విద్యను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా వేదం పాఠశాల కృషి కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరం

**అంశం : షటిల్ బ్యాడ్మింటన్**



**కొడిమ్యాల, ఏప్రిల్ 29(చట్టం) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మే 1 నుండి షటిల్ బ్యాడ్మింటన్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శిక్షకులు, ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరం నెలరోజుల పాటు కొనసాగుతుందని, ఉదయం 6 నుండి 8 గంటల వరకు సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు ఉంటుందని 14 సంవత్సరాల బాలబాలికలకు శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణలో పాల్గొనదల్చిన విద్యార్థులు satgasc.telangana.gov.in వెబ్సైట్లో తమ పేర్లు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని అన్నారు. కొడిమ్యాల గ్రామానికి షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరం కేటాయించినందుకు గాను జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ కు రాజమల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. వివరాలకు 9441431287 మొబైల్ నెంబర్ లో సంప్రదించాలన్నారు.

## నార్పల మండల ప్రజలకు శుభవార్త

**అభి మహి ఫుడ్ క్యాటరింగ్" ప్రారంభం..**






**నార్పల ఏప్రిల్ 29, (చట్టం) న్యూస్ :** నార్పల మండల కేంద్రంలో దిగుమరి రోడ్డు నీళ్ల ట్యాంకు దగ్గర చిన్నవడ్డి శ్రీకాంత్ రెడ్డి చేత ప్రారంభమైన కొత్త కొత్త రుచుల కొత్త ప్రయాణం మండల ప్రజలకు రుచికర మైన వంటకాలతో సేవ చేయాలనే సంకల్పంతో చిన్నవడ్డి శ్రీకాంత్ రెడ్డి "అభి మహి ఫుడ్ క్యాటరింగ్" ను ఘనంగా ప్రారంభించారు. చిన్న ఫంక్షన్‌ల నుండి పెద్ద వేడుకల వరకు ప్రతి కార్యక్రమానికి నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడమే ఈ క్యాటరింగ్ యొక్క ముఖ్య లక్ష్యంగా తెలిపారు.ఇంటి వంటల రుచిని గుర్తు చేసే విధంగా, కుటుంబంలో వాడే ప్రత్యేక మసాలా పేస్ట్‌తో తయారు చేసే వంటకాలే ఈ క్యాటరింగ్ ప్రత్యేకత.ప్రతి వంటకంలోనూ రుచి,నాణ్యత,శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు మంచి అనుభవాన్ని అందించడానికి శ్రీకాంత్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మండల ప్రజల ఆశీర్వాదం, స్నేహితులు మరియు సోదరుల సహకారంతో ఈ సేవను ప్రారంభించాను.ప్రతి ఒక్కరూ మా క్యాటరింగ్ సేవలను వినియోగించుకొని ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

# రిటైర్ ఉద్యోగుల పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలి..!

- పంజాల లింగమూర్తి కి సన్మానం
- రేవా జిల్లా అధ్యక్షులు సంకా బద్రి నారాయణ

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 29,(చట్టం న్యూస్) :** పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రేవా జిల్లా అధ్యక్షులు సంకా బద్రి నారాయణ అన్నారు. బుధవారం పంజాల లింగమూర్తి పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రేవా జిల్లా అధ్యక్షులు సంకా బద్రి నారాయణ మాట్లాడుతూ పంజాల లింగమూర్తి గత 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తి చేసి ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులను తయారు చేసిన ఘనత వారికే దక్కుతుందని ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఉన్నతమైన విలువలను పెంపొందిస్తుందని అన్నారు. పదవీ విరమణ ఉపాధ్యాయులకు ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు అందకపోవడం వలన ఇప్పటివరకు 93 మంది ఉద్యోగులు ఉపాధ్యాయులు మరణించడం జరిగిందనిఆవేదన వ్యక్తం చేశారు. ఈ



మరణాలన్నీ ప్రభుత్వ హత్యలుగా భావించవలసి వస్తుందని 2024 మార్చి నుండి ఇప్పటివరకు 20,500 మంది ఉద్యోగులు ఉపాధ్యాయులు రిటైర్ అయ్యి బెనిఫిట్స్ రాకా చాలామంది మనోవేదనతో హాస్పిటల్ పాలైనారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇకమీదట ఎవరు కూడా చనిపోకుండా ఉండడానికి మాకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఏప్రిల్ 23న జరిగిన క్యాబినెట్ సమావేశంలో 100 రోజుల్లో ఉద్యోగులకు బెనిఫిట్స్ అందజేస్తామని తీర్మానించారు, ప్రభుత్వం మాట నిలబెట్టుకుని పదవి విరమణ చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అందరికీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మే 1న ఉద్యోగ సంఘాలతో జరుపుతున్న చర్చలలో ప్రభుత్వం స్పందించి నెల రోజుల్లోపు రిటైర్డ్ అయిన అందరి బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని కోరుతున్నామని మేము దాచుకున్న డబ్బులను ఇతర కార్యక్రమాలకు వాడుకోవడం ప్రభుత్వ దివాలా కోరు తనానికి నిదర్శనంగా భావించవలసి వస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవా జిల్లా గౌరవాధ్యక్షులు సోమ గోవర్ధన్, ు. మురళీధర్ స్వామి, దొనికేన .అశోక్, జట్టి వెంకన్న, మాలోత్ .వెంకన్న మొదలగు వారు పాల్గొన్నారు.

# రాంపల్లి 2బీహెచ్‌కే కాలనీలో ప్రార్థనా స్థలాలు, శాంతి సమావేశ కేంద్రం కోసం వినతి..





**రాంపల్లి, ఏప్రిల్ 29 (చట్టం) :** రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ (2బీహెచ్‌కే) హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న 6,240 కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రార్థనా స్థలాలు మరియు శాంతియుత సమావేశ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆర్‌ఆర్‌ఆర్‌టీఆర్‌వీ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఫౌండేషన్ ప్రతినిధులు ఇటీవల ఎండోమెంట్స్ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలను కలిసి కాలనీలోని ప్రధాన సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా కాలనీలో దేవాలయం, మసీదు, చర్చి, సేవాలాల్ మహారాజ్ దేవాలయం ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించుకునే శాంతియుత సమావేశం మరియు ధ్యాన కేంద్రం కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశంపై స్పందించిన మంత్రులు సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్, అలాగే రెవెన్యూ శాఖ అధికారులైన రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు మండల రెవెన్యూ అధికారులకు ప్రభుత్వానికి చెందిన అనుకూల స్థలాన్ని గుర్తించి ధృవీకరించి ప్రజల ఉపయోగార్థం కేటాయించాలని సూచించినట్లు సమాచారం.

కాలనీలో భారీ సంఖ్యలో కుటుంబాలు నివసిస్తున్నందున సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం మరియు శాంతి పరిరక్షణకు ఇటువంటి ప్రార్థనా స్థలాలు, సమావేశ కేంద్రాలు అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్‌టీఆర్‌వీ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి కాంపల్లి రవి, సభ్యులు లక్ష్మణ్ యాదవ్, మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బ్లూబెల్స్ విద్యార్థుల ప్రభంజనం

## వరుసగా 10వ సంవత్సరం 100% ఉత్తీర్ణత

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఉన్న బ్లూబెల్స్ హై స్కూల్ విద్యార్థులు బుధవారం ప్రకటించిన పదో తరగతి (రాజ) ఫలితాలలో అద్భుత విజయాన్ని సాధించారు. వరుసగా పదవ సంవత్సరంగా 100% ఉత్తీర్ణత నమోదు చేసి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ సంవత్సరంలో అత్యధికంగా 583 మార్కులతో కె. యజ్ఞశ్రీ ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు గర్వకారణమయ్యారు.

**టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు:**

1. కె. యజ్ఞశ్రీ -- 583
2. టి. రిషిత్ -- 581
3. పి. అక్షయ శ్రీ -- 581
4. టి. నిహాల్ -- 580
5. యం. దీపిక -- 579
6. యం. వినయ శ్రీ -- 576
7. బి. రిషి నందన్ -- 575
8. ఆర్. శ్రీ హర్ష -- 574
9. యస్. మారుతి -- 574
10. బి. సాయి సుహాన్ -- 573
11. యన్. మోక్షక్ -- 571
12. యం. యశ్వంత్ పటేల్ -- 571

మొత్తం 54 మంది విద్యార్థుల్లో 48 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం విశేషం.




**ఫలితాల విశ్లేషణ:**

580 పైగా మార్కులు -- 4 మంది
570 పైగా మార్కులు -- 12 మంది
550 పైగా మార్కులు -- 22 మంది
530 పైగా మార్కులు -- 34 మంది
500 పైగా మార్కులు -- 48 మంది

ఈ అద్భుత ఫలితాల నేపథ్యంలో పాఠశాల ప్రిన్సిపల్ ఑ కరస్పాండెంట్ శ్రీమతి జంగ సునీత మనోహర్ రెడ్డి గారు విద్యార్థులను అభినందించి, వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.





# సొంతింటి కల సాకారం

**- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**రాయికల్ ఏప్రిల్ 29 చట్టం :** నిరుపేదల సొంతింటి కళను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన పల్లి సంజన, రాయికల్ పట్టణ 3వ వార్డుకు చెందిన సాథర్ల రత్నమ్మల గృహ ప్రవేశం బుధవారం పండుగ వాతావరణంలో లబ్ధిదారుల ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, శుభాకాంక్షలు తెలిపి, చీర కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం పక్క పాదదర్శకంగా జరుగుతుందన్నారు. సొంత తలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదలవారీగా నిధులను విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కట్కం రవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్రావు, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, ఏనుగు మల్లారెడ్డి, గన్నె రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జీవన్ రెడ్డి, కౌన్సిలర్లు రాకేష్, పల్లికొండ గంగాధర్, ఉపసర్పంచ్ తాలూకా రాజేశం, మాజీ ఎంపిటిసి రవి, నాయకులు సురేష్, వినోద్ రావు, నర్సయ్య, తిరుపతిరావు, మాజీ సర్పంచ్ ముత్తయ్య, స్తానిక వార్డు సభ్యులు తిరుపతి, జలంధర్ రెడ్డి, జగన్, పవన్, బాలయ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో సత్తా చాటిన అక్షర విద్యాసంస్థల విద్యార్థులు




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 29,( చట్టం బ్యూరో) :** కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం గోపాలరావుపేట్ లో గల అక్షర విద్యాసంస్థల విద్యార్థులు 10 ఫలితాలలో సత్తా చాటారు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ మునీందర్ మాట్లాడుతూ పది ఫలితాలలో కే మధుమిత 589 ఏ హర్షిని 586, ఎస్ శ్రీజ 581 , నీతూ వచ్చన్ 574 సాధించినట్లు తెలిపారు. నూతన అడ్మిషన్లు ప్రారంభమైనవని తెలిపారు. విద్యార్థులకు విద్య తో పాటు అన్ని రంగాలలో ముందుకు వెళ్లేందుకు ఉత్తమ శిక్షణను అందిస్తున్నామని పేర్కొన్నారు. అత్యుత్తమమైన ఫలితాలను సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

# నృసింహ స్వామి వారి జయంతి ఉత్సవాలు



**ఏలూరు జిల్లా ఆగిపల్లి మండలం ఏప్రిల్ 28 :** శోభనగిరిపై వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జయంతి ఉత్సవాలు ఈరోజు అనగా గురువారం జరుగునని ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు తెలిపారు. శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వార్ల దేవస్థానము లో శ్రీ నరసింహస్వామి వార్ల జయంతి ఉత్సవాలు ది.30.04.2026 వ తేదీ గురువారం ఉదయం .సుప్రభాత సేవ,స్వామివారి కి విశేష అర్చన, నవకలశ పంచామృత సహిత ఫలరస స్నపన, విశేష అలంకరణ సహస్రనామార్చన నారసింహ మూల మంత్రం హోమము,పూర్ణాహుతి,నీరాజన,మంత్రపుష్ప, తీర్థ ప్రసాద వినియోగం 01.05.2026.వ తేదీ శుక్రవారం వైశాఖ పూర్ణిమ స్వాతి నక్షత్రం సందర్భంగా ఎగువ సన్నిధి శ్రీ స్వామివార్ల కు పంచామృత సహిత సుగంధ ద్రవ్య స్నపన ,విశేష అలంకరణ ,సహస్రనామార్చన,నారసింహ మూల మంత్ర హోమము,పూర్ణాహుతి,నీరాజన మంత్రం పుష్ప తీర్థ ప్రసాద వినియోగం జరుగునని ఆలయ కార్యదర్శి సాయి బాబు తెలిపారు. కావున భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాధములు స్వీకరించి స్వామివారి దివ్యానుగ్రహానికి పాత్రులు కాగలరు. స్వామివారి ఉత్సవంలో పాల్గొనే భక్తులు ఆలయములో సంప్రదించగలరని సాయిబాబు తెలిపారు.

# ఆయిల్ ఫుల్ వాహనాలు నిల్



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఏప్రిల్ 28 చట్టం ప్రతినిధి :** నిన్న మొన్నటిదాకా ఆయిల్ బంకులు వద్ద క్యూ కట్టిన వాహనాలు ఈరోజు కనుమరుగయ్యాయి .బంకుల ముందు తప్పెట్లు తాళాలతో యాగి చేసిన వైసిపి పార్టీ ప్రతినిధులు అడ్రస్ లేరు .కేవలం మీడియాలో ప్రభావితమైన అంశాల వల్ల వాహనాలు అవసరానికి అన్నా ఎక్కువ ఆయిల్ నింపుకుండటం వల్ల వచ్చిన ఆనిశ్చితి ఈరోజుతో తొలగిపోయింది .అవసరం కన్నా ఎక్కువ ఆయిల్ ట్యాంకులలో నింపడం వల్ల కనీసం వారం రోజులు దాకా ఆయిల్ కోసం బంకుల మొహం చూసే అవసరం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఆయిల్ కంపెనీలు ప్రభుత్వం అడిగినన్ని ట్యాంకులు సరఫరా చేయగా బంకులన్నీ ఆయిల్ తో నిండిపోయాయి .సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న వైసీపీ లీడర్స్ ఈ చర్యతో వెనుకంజ వేశారు. ఈ రోజు ఎక్కడ బంకులు చూసినా ఖాళీగానే దర్శనమిచ్చాయి. నిన్నటి వరకు పోలీస్ ప్రొటెక్షన్ తో ఆయిల్ సప్లై చేసి న బంకులు ఈరోజు ఎంత కావాలన్నా పోయటానికి రెడీగా ఉన్నాయి.

# ముందున్నది మండుటెండల కాలం

## మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే

హైదరాబాద్,ఏప్రిల్29 : రాష్ట్రంలో భానుడు ప్రచండ భానుడిగా మారాడు. ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. బయటకు వస్తే మాడి మసైపోతారా అన్నట్లుగా ఎండలు దంచి కొడుతున్నాయి. మేలో మరింత తీవ్రంగా ఎండలు ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. రోహిణి కార్తె రాకముందే నిప్పులు కురిపిస్తున్నాడు. అక్కడక్కడా జల్లులు కురుస్తున్నా రాష్ట్రంలో పలుచోట్ల చండప్రచండగా ఎండలు మండుతున్నాయి. దీంతో ఉదయం 9గంటలు దాటిన తర్వాత బయటకు రావాలంటే జనం బెంబేలెత్తి పోతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన ఎండలు, వడగాలుల ధాటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో జనసంచారం లేక రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత ప్రమాదస్థాయికి చేరినట్టు హెచ్చరించింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, 12 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వెల్లడించింది.

## చట్టం సాహితీ లోకం

95814 19999

### హితము గ్రహించుము!




అందరి హితమును కోరువాడు హితకారి
సహకారము అందించువాడు సహకారి
పరులకు ఉపకారం చేయువాడు పరోపకారి
మంచి మనసున్నవాడు చూపేది మంచిదారి
అలాంటి వారే కావాలి మనకు సహచరి
శ్రీవరా!

అనుభవజ్ఞులు హితబోధను చేయుదురు
మహాత్ములు లోకహితమును కోరుదురు
మంచివారు పరహితముకై పాటుపడుదురు
లోకోపకారులు సదా సాయమందింతురు
ఈ లోకమందు హితకారులే స్పందింతురు
శ్రీవరా!

అపమార్గములో పడి తిరుగాడేవానికి
నైతిక విలువలకు తిలోదకాలిచ్చినవానికి
మంచిచెడుల విచక్షణ కోల్పోయినవానికి
మానవతను మరిచిపోయి మసలేవానికి
హితబోధ తప్పనిసరి అవసరమే వారికి
శ్రీవరా!

సాహిత్యములో తప్పక హితముండును
సత్పురుషుల సాంగత్యం హితమొసగును
పవిత్ర గ్రంథములు హితబోధను చేయును
పతితులను పవిత్రులుగా మార్చగలుగును
సద్బుద్ధి కలవారికే హితవాక్యం రుచించును
శ్రీవరా!

ఈ.వి.వి.ఎస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



చట్టం సాహితీ లోకం 95814 19999






డియర్ కామ్రేడ్ వదులు నీలోని నిరాశావాదాన్ని..వేయి అడుగు ముందుకు ఆశా వాదం తో..సాన పడితేనే గా మేలిమి వజ్రం అయ్యి మెరిసేది అంటూ..నిజాన్ని నిక్కచ్చిగా చెబుతూ..మాలో ఒకడిగా మా వెన్నంటి ఉంటూ..మా తోబుట్టువులు గా..మార్గదర్శి గా మా వెన్నంటి ఉంటూ..ఎవరో అన్నట్టు..నలుగురిలో నువ్వున్నా..నీలో నిన్ను లేకుండా చేసేది ప్రేమా అయితే..నీవు ఒంటరిగా ఉన్నా నీకు తోడుగా నీడగా మేమూ నలుగురం ఉన్నాం నీతో అని చాటి చెప్పేది స్నేహం..అలాంటి స్నేహం ను నీనుండి మేమూ పొందుతున్నాము.. చెదరని చిరునవ్వు నీదైతే..చెరగని జ్ఞాపకంగా నీవుంటావు..అన్న నానుడిని నిజం చేశావు..అన్నింటా నా వెన్నంటి ఉంటూ..మరువలేని.. మరచిపోని.. మధురానుభూతులను పంచినావు..నీవంటే నాకు ఎంత ఇష్టమో..చెప్పాలంటే ఆకాశంలోనీ నక్షత్రలను లెక్కించినట్టే..నమ్మకం కలగకపోతే నా హృదయ స్పందన ను విను తెలుస్తుంది..నీవంటే ఎంత ఇష్టమో..నీవు అందించిన సహకారం మా జ్ఞాపకాలలో సజీవంగా సహజీవనం చేస్తూ ఉంటుంది..ఏది ఏమైనా నీ భావి జీవితం ఆయురారోగ్యాల తో అష్టైశ్వర్వల తో తులతుగాలని మనసారాగ కోరుకుంటూ మరొక్క మారు..నీకు అభినందనలు..శుభాకాంక్షలు తెలుపుతూ..ఎల్లప్పుడూ మీ క్షేమాన్ని కాంక్షించే మీ శేఖర్ ఏ.డీ.సీ టీజీఎస్ ఆర్టీసీ మహాత్మా గాంధీ బస్ స్టేషన్ హైదరాబాద్..

చట్టం సాహితీ లోకం 95814 19999

### పుడమి ఒడిలో మత్తును బొందపెడదాం...

మత్తు మత్తులో చిక్కకు
మత్తులో మునగకు
మత్తు మన మనుగడను దెబ్బతీస్తుంది

మత్తు లో ఏముందో...
గమ్మత్తుగా మత్తులో ఊగుతూ
గింగరాలు తిరుగుతూ

గంగిరెద్దులా గంతులు వేస్తారు
డూడూ బసవన్న లా బడాయి
మాటలు మాట్లాడుతూ

గాలిలో మేడలు కడతారు
గానుగెద్దులా చుట్టూ తిరుగుతూ
ఒకటే రొద చేస్తారు

మత్తు లో వాగ్దానాలు ఇస్తూ
నదురు బెదురు లేకుండా
వదరుబోతు లా వదురుతారు

బాధలు మరవడానికంటూ
మెల్లగా మత్తుకు అలవాటు పడి
మైకంలో మునిగిపోతున్నారు

మత్తులో మునిగి బంధాలు
దూరం చేసుకొంటూ బహూదూరపు
బాటసారి వలె బానిసలాగ మారకు

క్షణం సుఖం కొరకు లక్షణమైన
నీ కుటుంబ జీవనాన్ని క్షణ క్షణం
నరకూపంగా మార్చుకుంటున్నాడు మనిషి

చదువు , సంధ్యలు గౌరవ మర్యాదలు
మంట కలుపుతూ , మానవత్వాన్ని
మాయని మచ్చ లా మార్చుతుంది మత్తు

చిన్నా పెద్దా, రాజు బంటు అనే బేధభావాలు
బాధ్యతలు మరిచి బహిరంగంగా
సేవిస్తున్నారు మత్తును
నేడు మత్తుకు బానిసకానిది ఎవరు

నేడు యువకులు మత్తుకు మరికి
డగ్స్ విషవలయం లో చిక్కుకొని
కుటుంబాలను కకావికలం చేస్తున్నది మత్తు

కామాంధుల కబంధ హస్తాల్లో చిక్కుకొన్న
కటుంబాలెన్నో మత్తులో మునిగి మత్తు అనే
సుడిగుండాల్లో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరి
అవుతున్నాయి

మత్తులో మునిగి వాహనాలను
ఇష్టారాజ్యంగా అడ్డదారిలో నడుపుతూ
నరకానికి దారులు వెతుకుతున్నారు

కన్నవారి కలలను వమ్ము చేస్తూ
కడుపుకోత కు కారణం కాకండి
కలకాలం చిరంజీవి గా వుండాలంటే

మత్తుకు దూరంగా జరగి
విషం అనే మత్తు వృక్షాన్ని కూకటివేళ్లతో
పెకిలించి పుడమి ఒడిలో మత్తును
బొందపెడదాం...

రచన:-
పరిమి వేంకట నారాయణ పరిమి
కోదాడ 98484 32533..



చట్టం సాహితీ లోకం 95814 19999



నిస్సత్తువగా ఉన్నావో
కోపంగా
కక్ష పూరితంగా ప్రవర్తించావో
జీవితం నిష్ప్రయోజనం
నిస్సందేహంగా మిగిలేది నిశబ్దం.
ప్రశాంతంగా ఆలోచించు
ఓపికతో ప్రవర్తించు
స్నేహాన్ని అందించు
సమయాన్ని ప్రేమించు
సహకారం అందుకో
విలువలను తెలుసుకో

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం

### ఆశావాదం ఉండాలి..!

చేసే పనిలో
వెళ్లే మార్గంలో
లక్ష్య సాధనలో
జీవిత ఆశయం లో
ఆశా వాదంతో ఉండాలి
స్ఫూర్తి తో కోనసాగాలి.
బ్రతుకు పోరు గేలవాలంటే
సర్దుబాటు కావాలి
సామరస్యంగా సాగాలి
నిరాశగా



చట్టం సాహితీ లోకం 95814 19999

### జడ్జిమెంట్

నువ్వు ఎగిరే ముందు
పడే చోటు గుర్తుపెట్టుకో!
నీకు గర్వం పెరిగితే
జీవితమే నేల చూపిస్తుంది
మనిషి అనేవాడు
ఎన్ని కోల్పోయినా పర్వాలేదు
తన ఆత్మవిశ్వాసాన్ని మాత్రం
ఎప్పుడూ కోల్పోకూడదు
ఆ ఒక్క ఆత్మవిశ్వాసం
అనేది ఉంటే చాలు
మనిషి కోల్పోయిన అన్నింటినీ
తిరిగి నువ్వు పొందవచ్చు
ఇక్కడ ఎవరి జీవితానికి
వాడే న్యాయం చేసుకోలేడు
అలాంటిది పక్కోడి జీవితానికి
జడ్జిమెంట్ చెప్పమంటే మాత్రం
ప్రతి వాడు లాయరే అయిపోతాడు.



రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

చట్టం సాహితీ లోకం 95814 19999

### విడాకులు




పెళ్లంటే నూరేళ్ల పంట
కన్నీరు ఒలకకూడదు ఎవరికంట
అహంకారమే దీనికి తంటా
ఎవరికి వాళ్లు సర్దుకుపోతూ ఉంటే
పెద్దల ఆశీర్వాదం పొందుతారు ఆ జంట
చిలికి చిలికి గాలి వానలా మారకూడదు ఆ ఇంట
అర్థం చేసుకుంటూ నడిస్తే ఎంతో బాగంట
నేడు ఉమ్మడి కుటుంబాలు కరువై
విడమర్చి చెప్పేవాళ్లు లేరంట
చిన్న కుటుంబాలతోనే ఈ గొడవంతా
నాకన్నా నువ్వేంటి గొప్ప అంటూ
కీచులాటలతో గడుస్తుంది రోజంతా
చిన్న చిన్న విషయాలను భూతద్దంలో చూసుకుంటూ
ప్రశాంతంగా గడిచిపోతున్న జీవితాలలో
నిప్పులు పోసుకుంటూ
తల బిరుసుతనంతో
నాకే అన్ని తెలుసు అన్న పొగరుతో
ఇది నా సంసారం అన్న ధ్యాస లేక
చదువుకున్నా ఇంగిత జ్ఞానం లేక
చట్టాలు ఉన్నాయంటూ
సంస్కారం మర్చిపోయి
విడాకులు తీసుకుంటున్నారు నేటి యువత
చిన్న చిన్న విషయాలకే ఈ రాద్ధాంతం అంతా
ఇంటి పరువు పోతుంది అన్న సోయి లేక
ఎవరికోసం చేస్తున్నారు ఇదంతా
ఒకళ్ళని ఒకళ్ళు గౌరవించుకుంటూ
ముందుకు సాగితే
సంసారం మూడు పువ్వులు ఆరు కాయలే కదా
ఇలా ఆలోచించుకుంటూ ఆనందంగా జీవితం గడిపాలి సదా
మామిడాకుల్ని విడాకులుగా మార్చుకుంటే
మిగులుతుంది బాధ
మన పూర్వీకులు గడిపారు విడాకులన్న పదం రాకుండా
నేడు సాంకేతికత పెరిగి వెర్రితలలు వేస్తున్నారు యువత

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్



చట్టం సాహితీ లోకం 95814 19999

### "ఏడాది పాలవెల్లి... ముచ్చటైన మొదటి వార్షికోత్సవం."



మొదటి ముడి - ఏడాది ముచ్చట: ఒక ప్రేమ ప్రయాణం

సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజు.. మంగళ వాయిద్యాలు, బంధుమిత్రుల కోలాహలం, జీలకర్ర బెల్లం తలలపై పెట్టుకున్న ఆ మధుర క్షణం. అగ్ని సాక్షిగా అడుగులు వేసి, ఒకరికొకరు తోడుంటామని మాట ఇచ్చి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈ 365 రోజులు కేవలం క్యాలెండర్‌లో మారిన తేదీలు మాత్రమే కాదు, ఒకరి మనసును ఒకరు అర్థం చేసుకుంటూ రాసుకున్న అందమైన కావ్యంలోని తొలి అధ్యాయం.

పెళ్ళైన కొత్తలో అంతా ఒక కలలా అనిపించింది. ఇద్దరు వ్యక్తులు, రెండు వేర్వేరు ఆలోచనలు ఒకే గొడుగు కిందకు వచ్చినప్పుడు మొదట్లో కొన్ని చిన్న చిన్న తడబాట్లు సహజం. కానీ, ఆ తడబాట్లే మా మధ్య ప్రేమని పెంచాయి. కలిసి వండిన మొదటి వంటకం రుచిగా లేకపోయినా ఒకరినొకరు ఆటపట్టించుకుంటూ నవ్వుకోవడం, రోజంతా ఆఫీసు పనులతో అలసిపోయి వచ్చాక ఒక కప్పు కాఫీతో పంచుకున్న కబుర్లు, ఒకరి కళ్ళల్లో చూసి మరొకరి బాధను పసిగట్టడం.. ఇవే కదా అసలైన వైవాహిక బంధం అంటే!

ఈ ఏడాదిలో మేము నేర్చుకున్న అతిపెద్ద పాఠం ఏమిటంటే---ప్రేమ అంటే కేవలం ఒకరికొకరు బహుమతులు ఇచ్చుకోవడం కాదు, ఒకరి ఇష్టాలను గౌరవించడం. గొడవలు జరిగినప్పుడు గెలవడం కంటే, ఆ గొడవను ప్రేమతో ఎలా ముగించాలో తెలుసుకోవడం. కష్టాల్లో తోడుగా నిలబడటం, సుఖాల్లో ఆ సంతోషాన్ని రెట్టింపు చేసుకోవడం మా ఈ మొదటి వసంతం నేర్పిన గొప్ప అనుభూతి.

ఫోటో ఆల్బమ్‌లో ఉన్న మా పెళ్లి ఫోటోలు అప్పటి అందాన్ని చూపిస్తే, నేడు మా కళ్ళల్లో ఉన్న మెరుపు మా బంధం ఎంత బలపడిందో చెబుతోంది. ఒకటైన మా ప్రాణాలు, పెనవేసుకున్న మా ఆలోచనలు ఇప్పుడు ఒకే బాటలో నడుస్తున్నాయి. రాబోయే ఎన్నో ఏళ్ళ ప్రయాణానికి ఈ మొదటి ఏడాది ఒక బలమైన పునాదిగా నిలిచింది.మొదటి అడుగు విజయవంతంగా పడింది.. ఇక జీవితాంతం కలిసి నడవాల్సిన బాట మా కోసం వేచి ఉంది.

చరణం :యస్. రాహుల్ నాయక్

చట్టం సాహితీ లోకం 95814 19999

### మహా కవి శ్రీ శ్రీ జయంతి నేడు. 30-4-2026: అస్తమించని సూరీడు శ్రీ శ్రీ




బడుగులదేవుడు
అస్తమించని సూరీడు..
కవితాజగతిలోన కమలనాధుడు.
అభ్యుదయకవితకు రారాజు
ఆకలి మంటను చూసిన కవిరాజు

అలుపెరుగనిసాహితీ పోరాటయోధుడు.
మహా ప్రస్థానంలో భరత జాతికి ఆరాధ్యుడు
మరో ప్రపంచం పిలుస్తుందని చెప్పినదార్శి నికుడు.
విప్లవభావల్తో భరతజాతినిమేల్కొల్పిన జ్వాలాముఖుడు.

నేనుసైతంఅంటూ ప్రపంచాగ్నికి సమిధనొక్కటిఆహుతిచ్చారు .
అణగారినవారికోసం కవితలజయభేరిని మ్రోగించారు. అవతారంలో పుడమితల్లికి పురిటి నొప్పులంటూ
పర్యావరణ స్ఫూర్తిని ఆర్తీని జగతిన నింపాడు ..

బతుకుకోసం వలసవెళ్లిన
బాటసారివెతలుచూపాడు.
ముదిమివయసున అనాధైన
అవ్వదీనాలాపననువిన్నాడు.
మనుజులు ఎవ్వరు చూడనపుడు
జంతు జాలములే నయమన్నాడు.
ఎంగిలాకులో మానవత్వములేనిమనుషుల
కన్నా జంతుజాలములే నయమనిపించాడు .

సమాజమందలి అసమానతలను ఎత్తి చూపాడు
ఆర్థిక అసమానతలు తొలగి ప్రగతి బాట నడవ మన్నాడు
దోపిడీ వ్యవస్థపై ఎక్కుపెట్టిన నిప్పు కణమైనాడు
పీడిత తాడిత ప్రజల వెన్ను తట్టిన ధీరుడైనాడు

తెలుగువీరలేవరా దీక్ష బూని సాగరా అంటూ
అల్లూరి చేత తెలుగుజాతిని జాగృతం చేశారు
అణగారిన పీడిత ప్రజల గుండె చప్పుడు శ్రీ శ్రీ
యుగాలెన్నిమారినా ఇగిరిపోనివిప్లవ ఝరి శ్రీ శ్రీ

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.కవి, రచయిత.
విశ్రాంత ఉపాధ్యాయులు. వి. కోట.చిత్తూరు జిల్లా.
9000169823



### శ్రీవేంకటేశ్వరా కైవల్యమీయరా

వినవయ్య విన్నపము తిరువేంకటేశా
నినుగొల్తు ననుగావు నారాయణాద్రీశ

వినతాత్మజాగమన పెనుబాము శయనుడా
ఘనశక్ర సన్నుతా కరుణా సముద్రుడా
మును లమర కిన్నర లష్టదిక్పతి నుతుడ
మనసార దీవించు మాధవాచ్యుతుడా

ఉచితానుచిత మ్మెరుగక ప్రశస్తమాలోచించక
నీచ క్రోధగ్రస్తునైతి నిన్నునేను మరచితిని
విచక్షణము లోపించె వినాశనము దాపురించె
నీ చరణ స్మరణశక్తి నీ కృప శ్రీరామ రక్ష

కమలధారి కమలాప్త కమలరిపు కమలభవులు
నీమోము సోమునిగన నిలిచినిన్ను వినుతించిరి
ప్రమాదహర శ్రీహరి ప్రమోదమిడు శ్రియఃపతీ
మమపాతకాధ్వంసి మెయివాయి మనమిత్తు

శరణుశరణు సిరిమగడా శరణుదైత్య గర్వహారి
పరమేశ్వర పురుషోత్తమ పరమపురుషగోవిందా
కరుణజూపు కరివరదా ప్రహ్లాదాఖ్య స్తుతుడా
పరమశాంతి సంతసమిడు కైవల్య వరప్రదాయి

రచన:: డాబ్బికారు శంకర్ జీ
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

---
---
---
-






# బుర్ర తక్కువై.. హనుమాన్ వదులుకున్నా

## నటి ఫరియా అబ్దుల్లా వ్యాఖ్యలు



బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం మే 1 విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది. ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త ఊపునివ్వాలని భావిస్తోంది.

# బన్సాలీ సినిమాలో రామ్‌చరణ్ బదులు..ధనుష్





ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తన సినిమాల ద్వారా విజువల్ గ్రాండియర్‌కు కొత్త అర్థం తీసుకొచ్చిన వ్యక్తిగా పేరు పొందారు. ఆయన తెరకెక్కించే ప్రతి చిత్రం విజువల్ వండర్‌గా నిలుస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో భన్సాలీ ప్రొడక్షన్స్ నుంచి రాబోతున్న మరో భారీ ప్రాజెక్ట్ ఇప్పుడు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ బ్జడెట్‌తో రూపొందనున్న ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామాను పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాతో మిత్రన్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. అడవి నేపథ్యంలో సాగే పౌరాణిక గాథను అత్యాధునిక సాంకేతికతతో, భన్సాలీ స్టైల్ గ్రాండియర్‌తో తెరకెక్కించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం మొదట మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పేరును పరిశీలించినట్లు సమాచారం. ఈ పాత్రకు ఆయన సరిపోతారని భావించినప్పటికీ, పలు కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆయన చేతిలోకి రాలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అవకాశం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌ని వరించిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ధనుష్ తన విభిన్నమైన పాత్రల ఎంపికతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ వస్తున్నాడు. ప్రత్యేకంగా కంటెంట్ ఆధారిత సినిమాల్లో తనదైన ముద్ర వేసిన ఆయనకు ఈ మైథోలాజికల్ పాత్ర మరో మైలురాయిగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పాత్రకు అవసరమైన నటన, యాక్షన్, భావోద్వేగాలను సమర్థంగా ప్రదర్శించగల సామర్థ్యం ధనుష్‌లో ఉందనే నమ్మకంతోనే భన్సాలీ టీమ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాక్. ఈ సినిమా కథాంశం పురాణ కాలం నేపథ్యంలో అడవిలో జరిగే సంఘటనల చుట్టూ తిరుగుతుందని సమాచారం. గ్రాండియర్ విజువల్స్, శక్తివంతమైన కథనం, సాంకేతిక నైపుణ్యంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రామ్ చరణ్ నుంచి ధనుష్ చేతికి వెళ్లిన ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇటు దక్షిణాది, అటు బాలీవుడ్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తుండగా, ఈ మైథోలాజికల్ జంగిల్ డ్రామా ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# నెట్‌ఫ్లిక్స్‌కు ఫిక్సయిన డెకాయిట్




టాలీవుడ్ యువ కథానాయకుడు అడివి శేష్, అందాల నటి మృణాల్ ఠాకూర్ కలిసి నటించిన యాక్షన్ ప్రేమకథ డెకాయిట్ ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం మంచి వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. విడుదలై మూడు వారాలు దాటినా కూడా వారాంతాల్లో గట్టి కలెక్షన్స్ రావడం ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందనేది తెలియజేస్తుంది. ఈ విజయానికి ప్రధాన కారణం హీరో అడివి శేష్ సహజ నటన, మృణాల్ ఠాకూర్ అభినయం. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం సినిమా భావోద్వేగాలను మరింత ఎలివేట్ చేసింది. కథలో యాక్షన్, ఎమోషన్, ప్రేమ వంటి అంశాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఇప్పుడు ఇదే చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా అప్‌డేట్స్ ప్రకారం, మే 8 నుంచి దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, డిజిటల్ రిలీజ్ దాదాపు ఖరారైనట్టే తెలుస్తోంది.థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మరోసారి ఈ యాక్షన్ ప్రేమకథను ఆస్వాదించాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు.

-------------

# వారణాసికి ప్రపంచ మార్కెట్

## పక్కా ప్రణాళికతో చిత్ర బృందం అడుగులు



అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన సినిమాలతో పాన్ ఇండియా సహా... మరెన్నో సరికొత్త మార్కెట్లకి దారి వేశారు. ఆ దారి తెలుగు సినిమాలకు గత కొన్నేళ్లుగా రాచబాటగా మారింది. 'బాహుబలి' సినిమాల తర్వాత జపాన్ సహా ఎన్నో దేశాల్లో తెలుగు సినిమాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అదే తరహాలో మరిన్న దేశాల్లో వారణాసిని తీసుకెళ్లేలా దర్శకుడు రాజమౌళి ప్లాన్ వేస్తున్నారు. మార్కెట్‌ను పెంచుకోవడం లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నారు. వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని ఆ చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాల్లో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలతో 'వారణాసి' బృందం ఉంది. అందులో భాగంగానే ఇటీవల మెక్సికోలో జరిగిన కామిక్ కాన్‌లో సినిమాని ప్రచారం చేశారు. రాజమౌళి వీడియో సందేశంతోపాటు, 'వారణాసి' తెరవెనక సన్నివేశాల్ని అందులో ప్రదర్శించారు. తదుపరి బ్రెజిల్‌తోపాటు మరిన్ని దేశాల్లోనూ 'వారణాసి' సినిమాని ప్రచారం చేయనున్నట్టు తెలుస్తోంది. మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవలే ఓ పాటని తెరకెక్కించారు. మే తొలి వారం నుంచి హైదరాబాద్‌లోనే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం అవుతుంది. కథానాయకుడు మహేశ్ ఇతర తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# యశ్ టాక్సిక్ విడుదల మరోమారు వాయిదా




కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం టాక్సిక్ మరోసారి వాయిదా పడింది. విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. సినిమా కాన్ ఈవెంట్‌లో 'టాక్సిక్'కు వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. అందుకే త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఇక ఈ వాయిదా వెనుక మరికొన్ని కారణాలు కూడా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒక ప్రముఖ సంస్థ రూ.110 కోట్లు ఆఫర్ చేయగా, నిర్మాతలు మాత్రం కనీసం రూ.250 కోట్లు ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్ ఇంకా ఖరారు కాకపోవడం కూడా ఆలస్యానికి కారణమైందని తెలుస్తోంది. అలాగే కొన్ని ప్యాచ్ వర్క్ పనులు ఇంకా పూర్తికాకపోవడం, సెన్సార్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడం కూడా వాయిదాకు దారితీసిన అంశాలుగా చెబుతున్నారు. అంతేకాకుండా పశ్చిమాసియాలో ఉన్న అనిశ్చిత పరిస్థితులు గ్లోబల్ రిలీజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మేకర్స్ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రస్తుతం ఇతర ప్రాజెక్టుల పనుల్లో బిజీగా ఉండటంతో, పూర్తి స్థాయిలో ప్రమోషన్లపై దృష్టి సారించేందుకు సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కన్నడతో పాటు తెలుగు సహా ఆరు భాషల్లో భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న 'టాక్సిక్', భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించే చిత్రంగా నిలుస్తుందని యష్ నమ్మకం వ్యక్తం చేశారు. విడుదల ఆలస్యమైనా, బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాత్ర కోసం రిస్క్‌కు వెనకాడని రష్మిక




పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# చట్టం స్పోర్ట్స్

## శ్రీలంక బోర్డు ప్యానెల్ మొత్తం రాజీనామా!



శ్రీలంక క్రికెట్ బోర్డులో పెను సంచలనం జరిగింది. బోర్డు ప్రెసిడెంట్ షమ్మి సిల్వ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. అయితే ఆయనతోపాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మొత్తం సామూహికంగా రాజీనామా సమర్పించం క్రీడా వర్గాల్లో హాట్?టాపిక్?గా మారింది. షమ్మి తన రాజీనామా విషయాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే, క్రీడాశాఖ మంత్రి సునీల్ కుమార గమగేకు అధికారికంగా సమాచారం అందించారు. అయితే ఒకేసారి ఇంత మంది పదవి నుంచి తప్పుకోవడానికి గల కారణాలు మాత్రం బోర్డు వెల్లడించలేదు. అయితే బోర్డులో ఆర్థిక అవకతవకలపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, అధ్యక్షుడు దిస్సనాయకే రీసెంట్?గా బోర్డు సభ్యులతో చర్చలు జరిపారు. సుమారు మూడు గంటలపాటు ఈ చర్చలు కొనసాగాయి. కార్యనిర్వాహక కమిటీ చర్చల అనంతరం సిల్వా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే, రాజీనామాకు గల కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే సిల్వపై అనేక ఆర్థిక అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై ఆటగాళ్లు సైతం ఆరోపణలు చేశారు. దీంతోపాటుగా గత కొంతకాలంగా ఇంటర్నేషనల్ లెవెల్?లో శ్రీలంక జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ క్రమంలోనే బోర్డులోని పరిస్థితులను అక్కడి ప్రభుత్వం కొంతకాలంగా క్షణ్ణంగా గమనిస్తూ వస్తుంది. ఈ క్రమంలో గతనెల నుంచి సిల్వాను తొలగించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తూ వచ్చింది. తాజాగా ఆయనే స్వయంగా పదవి నుంచి వైదొలిగారు. కాగా, సిల్వతోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్ల రాజీనామాలను ఆమోదించినట్లు క్రీడా శాఖ మంత్రి సునీల్ ధ్రువీకరించారు. అలాగే శ్రీలంక క్రికెట్‌లో నెలకొన్న ప్రస్తుత సమస్యలను పరిష్కరించడానికి, నిర్మాణాత్మక సంస్కరణలను అమలు చేయడానికి త్వరలోనే ఒక తాత్కాలిక కమిటీని నియమిస్తామని పేర్కొన్నారు. మరి తదుపరి ఈ బాధ్యతలు ఎవరు చేపడతాని ఆసక్తిగా మారింది. అయితే సిల్వాతో పాటు కార్యనిర్వాహక కమిటీ రాజీనామా చేసిన నేపథ్యంలో, బోర్డు నియంత్రణను తమ ఆధీనంలోకి తీసుకోవాలని శ్రీలంక ప్రభుత్వం నిర్ణయించింది. '1973 క్రీడా చట్టంలోని సెక్షన్లు 31, 34 ప్రకారం 'శ్రీలంక క్రికెట్'కు సంబంధించిన సమస్త పరిపాలనా విధులు తాత్కాలికంగా క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోకి తీసుకోనున్నాం' అని క్రీడా శాఖ మంత్రి సునీల్ కుమార గమగే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఐసీసీ నిబంధనల ప్రకారం దేశ క్రికెట్ బోర్డు పాలనాపరమైన విధానాల్లో రాజకీయాల జోక్యం ఉండకూడదు. మరి దీనిపై లంక ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో అనేది చూడాలి! కాగా, షమ్మి సిల్వ ఏడేళ్లుగా లంక బోర్డు అధ్యక్షుడిగా కొనసాగుతూ వచ్చారు. ఆయన 2019లో తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2021, 2023, 2025లో ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. అయితే ఈ ఏడాది శ్రీలంక క్రికెట్ జట్టు కీలక పర్యటనలకు వెళ్లనుంది. ఆయా జట్లతో టీ20, వన్డే, టెస్టు సిరీస్?లు ఆడాల్సి ఉంది. ఈ జూన్?లో వెస్టిండీస్? పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్?లో ఆతిథ్య విండీస్?తో లంక జట్టు మూడేసి టీ20, వన్డే మ్యాచ్?లు ఆడుతుంది. అలాగే 2 మ్యాచ్?ల టెస్టు సిరీస్ ఆడనుంది. జూన్ 03న ప్రారంభమై, జులై 07 దాకా ఈ పర్యటన కొనసాగనుంది. ఇక సెప్టెంబర్?లో ఇంగ్లాండ్?కు పయనమవ్వాల్సి ఉంది. ఈ టూర్?లో మూడు టీ20, మూడు వన్డే మ్యాచ్?ల సిరీస్?లు ఆడుతుంది. ఆ తర్వాత డిసెంబర్?లో భారత్? పర్యటనకు రావాల్సి ఉంది. ఇక్కడ లంక జట్టు టీమ్ఇండియాతో మూడు టీ20, మూడు వన్డే మ్యాచ్?ల సిరీస్?లో పోటీ పడనుంది. డిసెంబర్ 13న ఈ పర్యటన ప్రారంభం కానుంది. మొదట వన్డే సిరీస్? ఉండనుంది. ఆ తర్వాత టీ20 సిరీస్? ఉంటుంది.

............

## ఈ-సిగరేట్ తాగుతూ కెమెరాకి దొరికిన రియాన్ పరాగ్



ఐపీఎల్ 2026లో అదిరిపోయే విజయాలతో దూసుకుపోతున్న రాజస్థాన్ రాయల్స్ టీమ్.. పంజాబ్ కింగ్స్ విజయాల పరంపరకు బ్రేక్ వేసి పాయింట్ల పట్టికలో తన సత్తా చాటింది. అయితే ఈ సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మంగళవారం న్యూ చండీగఢ్ వేదికగా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. అయితే రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ జరుగుతుండగా డ్రెస్సింగ్ రూమ్‌లో రియాన్ పరాగ్ వేపింగ్ (ఈ-సిగరేట్) చేస్తూ కనిపించాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ పక్కన ఉండగానే పరాగ్ ఈ-సిగరేట్ తాగుతూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అధికృత ప్రాంతాలు మినహా.. ఛేజింగ్ రూమ్‌లలో లేదా మైదానాల్లో ధూమపానంకు అనుమతి లేదు. అదే సమయంలో 2019 నుంచి భారత్‌లో ఇ సిగరేట్ల విక్రయం, వాడకం పైనా నిషేదం ఉంది. ఒకవేళ పరాగ్ ఇ-సిగరేట్ తాగాడని తేలితే మాత్రం భారతదేశం ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం 2019 కింద అతడికి శిక్ష పడే అవకాశం ఉందని అంటున్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష, భారీ జరిమానా విధించబడతాయి. అంతేకాకుండా బీసీసీఐ కూడా అతడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో ఆర్ఆర్ 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఇదే తొలి ఓటమి. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో మార్కస్ స్టోయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (59; 44 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) లు హాఫ్ సెంచరీలు చేశారు. కూపర్ కొన్నోలీ (30; 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (29; 11 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా రెండు వికెట్లు తీశాడు. జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 223 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆర్ఆర్ బ్యాటర్లలో డోనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (51; 27 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ (43 ; 16 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు), శుభమ్ దుబే (31 నాటౌట్; 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడారు. పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ మూడు, అర్షదీప్ సింగ్ ఓ వికెట్ పడగొట్టాడు.

## పంజాబ్ కింగ్స్‌కు తొలి ఓటమి



ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. 223 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తున్న పంజాబ్ కింగ్స్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. లీగ్ ఆరంభమైన నెల రోజులకు ఈ జట్టు తొలి ఓటమిని రుచి చూసింది. గత మ్యాచ్‌లో 265 పరుగుల లక్ష్యం ముందున్నా పంజాబ్ కింగ్స్ విజయాన్ని వదిలిపెట్టలేదు. కానీ మంగళవారం రాజస్థాన్ చేతిలో ఓటమి పాలైంది. బ్యాటింగ్‌లో సత్తా చాటిన రాయల్స్ 223 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వీ జైస్వాల్ (51; 27 బంతుల్లో 7x4, 1x6), వైభవ్ సూర్యవంశీ (43; 16 బంతుల్లో 3x4, 5x6) జట్టుకు గట్టి ఇన్నింగ్స్? అందించగా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డొనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6x4, 3x6) విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. రియాన్ పరాగ్ (29; 16 బంతుల్లో 2x4, 2x6), శుభమ్ దూబె (31 నాటౌట్; 12 బంతుల్లో 3x4, 2x6) పరుగులు చేశారు. మొదట పంజాబ్ 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. స్టాయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4x4, 6x6), ప్రభ్‌సిమ్రన్ (59; 44 బంతుల్లో 6x4, 1x6). లక్ష్యం పెద్దదైనప్పటికీ ప్రణాళికతో ఆడిన రాయల్స్ సులువుగా విజయాన్ని ఛేధించింది. వైభవ్ సూర్యవంశీ ఛేదనలో జట్టుకు బలమైన పునాది వేశాడు. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లో మొదటి బంతికి యశస్వి సింగిల్ తీస్తే రెండు బంతులు డాట్స్ ఆడిన వైభవ్ చివరి మూడు బంతులకు 6, 4, 4 తో ఓవర్? ముగించాడు. ఫెర్గూసన్ వేసిన రెండో ఓవర్లోనూ మొదటి బంతికి జైస్వాల్ సింగిల్ తీస్తే వైభవ్ తరువాత రెండు బంతులకు పరుగులు తీయలేదు. కానీ చివరి 3 బంతులకు 4, 6, 6 కొట్టేశాడు . చూస్తుండగానే 40 పరగులు చేసిన అతను, అర్ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్లో ఔటైనప్పటికీ రాయల్స్ స్కోరు వేగం మాత్రం తగ్గలేదు. సూర్యవంశీ ఔటయ్యాక జైస్వాల్ క్రీజులోకి వచ్చి భారీ షాట్లు ఆడాడు. పవర్‌ప్లేలో రాయల్స్ 84/1తో నిలిచింది. ఈ దశలో స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్, చాహల్ పొదుపుగా బౌలింగ్ వేశారు. చాహల్ వరుస ఓవర్లలో జురెల్ (16), యశస్విలను ఔట్ చేసి రాయల్స్‌పై ఒత్తిడి పెంచాడు. మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న పరాగ్ వికెట్? సైతం చాహల్‌లే తీశాడు. అయితే 6 ఓవర్లలో 72 పరుగులు చేయాల్సిన పరిస్థితిలో ఫెరీరా రాజస్థాన్? రాయల్స్‌కు హీరోగా మారాడు. పంజాబ్ ప్రధాన బౌలర్లు అర్ష్‌దీప్, ఫెర్గూసన్, యాన్సెన్‌లను గట్టిగా ఎదుర్కొన్న అతను భారీ షాట్లతో మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శుభమ్ దూబె సైతం భారీ షాట్లు ఆడడంతో రాయల్స్ పని తేలికైపోయింది. చివరి ఓవర్ రెండో బంతికి సిక్సర్ బాదిన ఫెరీరా మ్యాచ్‌ను ముగించడంతో పాటు అర్ధశతకం పూర్తి చేశాడు.

## మూడవసారి టీ20 ప్రపంచకప్ విజేతపై భారత్ కన్ను

ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టు కూడా వరుసగా మూడుసార్లు టీ20 ప్రపంచకప్ గెలవలేదు. ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకునేందుకు భారత సెలెక్టర్లు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఐపీఎల్ 2026లో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న కుర్రాళ్లను గుర్తించి, వారికి అంతర్జాతీయ అనుభవాన్ని అందించాలని బోర్డు నిర్ణయించింది. అనుభవం, యవ్వనం కలగలిసిన జట్టుతో ఆస్ట్రేలియా గడ్డపై సత్తా చాటాలని భారత్ భావిస్తోంది. 2028 ప్రపంచకప్ జట్టులో 2026 విజేత జట్టులోని కీలక సభ్యులు కొనసాగే అవకాశం ఉంది. సంజు శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లు తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. వీరికి తోడుగా బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ వంటి స్టార్ బౌలర్లు జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. వీరి అనుభవం జట్టుకు ఎంతో కీలకం కానుంది. ఈసారి జట్టులోకి కొంతమంది సరికొత్త ఆటగాళ్లు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రజత్ పాటిదార్, హర్షిత్ రాణాలకు మొదటిసారి ప్రపంచకప్ ఆడే అవకాశం లభించవచ్చు. 2026లో గాయం కారణంగా దూరమైన హర్షిత్ రాణా, ఈసారి తన సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నాడు. ఐపీఎల్ 2026లో వీరి ప్రదర్శన సెలెక్టర్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 2028 టీ20 ప్రపంచకప్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో సంయుక్తంగా జరగనుంది. అక్టోబర్ 21 నుంచి నవంబర్ 19 వరకు ఈ టోర్నీ నిర్వహించనున్నారు. గతంలో 2022లో ఆస్ట్రేలియా ఒంటరిగా ఆతిథ్యం ఇవ్వగా, ఈసారి కీవీ కూడా జతకట్టింది. అక్కడి పిచ్‌లు వేగంగా ఉంటాయని, అందుకే పేస్ బౌలింగ్‌కు అనుకూలించే ఆటగాళ్లను ఎంపిక చేయడంపై బోర్డు దృష్టి పెట్టింది. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ఫాంతో అంతగా లేదు. తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. ఈ క్రమంలో బీసీసీఐ మిస్టర్ 360 ప్లేయర్ ను తప్పించాలని చూస్తున్నట్లు వార్తలు వినిపస్తున్నాయి. కాగా, ఐపీఎల్ 2026లో దంచికొడుతోన్న శ్రేయాస్ అయ్యర్ ఈ ప్లేస్ లో వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ గా రీఎంట్రీ ఇవ్వొచ్చని తెలుస్తోంది.



టీ20 ప్రపంచకప్ 2028 కోసం భారత ప్రాబబుల్ టీం: సూర్యకుమార్ యాదవ్ / శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, శివం దూబే, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, రజత్ పాటిదార్, తిలక్ వర్మ, హర్షిత్ రాణా, వైభవ్ సూర్యవంశీ.

## ఆసియా క్రీడలకు సన్నద్ధమవుతోన్న భారత క్రికెట్ జట్టు



జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడల కోసం భారత సెలెక్టర్లు కసరత్తులు ప్రారంభించారు. ప్రధాన జట్టు అంతర్జాతీయ సిరీస్‌లలో బిజీగా ఉండటంతో, ఈ మెగా టోర్నీకి యువ ఆటగాళ్లతో కూడిన జట్టును పంపనున్నారు. తాజా నివేదికల ప్రకారం, టీమ్ ఇండియా కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్, వైస్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026లో వీరిద్దరూ ప్రదర్శించిన నాయకత్వ పటిమ, బ్యాటింగ్ నైపుణ్యం సెలెక్టర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి.భారత జట్టు నాయకత్వ బాధ్యతలకు శ్రేయాస్ అయ్యర్ అత్యంత అనువైన వ్యక్తిగా కనిపిస్తున్నారు. దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో కోల్‌కతా వంటి జట్లను విజయవంతంగా నడిపించిన అనుభవం అతనికి ఉంది. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం అయ్యర్ ప్రత్యేకత. యువ క్రీడాకారులకు దిశానిర్దేశం చేస్తూ, జట్టును ఐక్యంగా ఉంచగల సామర్థ్యం అతనికి అదనపు బలం. అనుభవం, స్థిరత్వం ప్రాతిపదికన సెలెక్టర్లు అయ్యర్ వైపు మొగ్గు చూపుతున్నారు.మరోవైపు, ఇషాన్ కిషన్ తన దూకుడైన ఆటతీరుతో, నాయకత్వ లక్షణాలతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు తాత్కాలిక సారథిగా వ్యవహరించినప్పుడు అతను తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు ప్రశంసలు పొందాయి. వికెట్ కీపింగ్ చేస్తూ మైదానాన్ని అంచనా వేయడంలో కిషన్ దిట్ట. జట్టులో ఉత్సాహాన్ని నింపుతూ, కీలక సమయాల్లో ఫలితాలను రాబట్టగల సత్తా ఉన్నందున అతన్ని ఉప-నాయకుడిగా ఎంపిక చేసే అవకాశం ఉంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించడమే లక్ష్యంగా బీసీసీఐ ప్రణాళికలు రచిస్తోంది. జపాన్ వేదికగా జరిగే ఈ టోర్నీలో యువ ఆటగాళ్లకు తమ సత్తా చాటుకునేందుకు ఇది ఒక గొప్ప వేదిక. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రతిభావంతులైన ఆటగాళ్లతో ఈ జట్టును నిర్మించనున్నారు. అధికారిక ప్రకటన ఇంకా రానప్పటికీ, అయ్యర్, కిషన్ ద్వయం భారత జట్టును విజయపథంలో నడిపిస్తారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తు భారత క్రికెట్ నాయకత్వాన్ని సిద్ధం చేసే దిశగా ఇది ఒక కీలక అడుగు కానుంది.

## జడేజా ఇంట ముదిరిన విభేదాలు



టీమిండియా స్టార్ క్రికెటర్ రవీంద్ర జడేజా కుటుంబంలో రాజకీయ సెగలు మరోసారి రాజుకున్నాయి. గుజరాత్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు జడేజా సోదరి, భార్య మధ్య ఉన్న విభేదాలను మళ్లీ తెరపైకి తెచ్చాయి. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వార్డ్ నెం-2 నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జడేజా సోదరి నైనాబా జడేజా పరాజయం పాలయ్యాడు. ఆ పరాజయంతో రవీంద్ర జడేజా ఇంట్లో రాజకీయంగా భార్య రివాబా జడేజాదే ఆధిపత్యం అని మరోసారి నిరూపితమైంది. ప్రస్తుతం జడేజా భార్య రివాబా జడేజా గుజరాత్ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగారు. జామ్‌నగర్ నార్త్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమె.. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే జడేజా సోదరి నైనాబా మాత్రం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వదినకు పూర్తి వ్యతిరేక దిశలో పయనిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. రివాబా జడేజాకు వ్యతిరేకంగా నైనాబా కాంగ్రెస్ తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది.జడేజా క్రికెట్ కెరీర్‌లో నైనాబా జడేజా పాత్ర ఎంతో కీలకమైనది. తల్లి మరణం తర్వాత జడేజాను ఓ తల్లిలా పెంచి పెద్ద చేయడమే కాకుండా క్రికెటర్‌గా ఎదగడానికి ఆమె ఎంతో కష్టపడ్డారు. ఈ విషయాన్ని రవీంద్ర జడేజా కూడా పలు సందర్భాల్లో గుర్తు చేసుకున్నాడు. కానీ రాజకీయాల విషయానికి వచ్చేసరికి జడేజా తన భార్య రివాబాకు మద్దతుగా నిలుస్తున్నాడు. ఇది సోదరి నైనాబాకు రుచించడం లేదు. ఇటీవల రివాబా మంత్రి హోదాలో రాజ్‌కోట్ సందర్శనకు వచ్చినప్పుడు కూడా నైనాబా ఆమెపై విమర్శలు గుప్పించడం వీరి మధ్య ఉన్న గ్యాప్‌ను స్పష్టం చేస్తోంది. ఓ వైపు కుటుంబంలో ఈ రాజకీయ రచ్చ కొనసాగుతుండగా.. రవీంద్ర జడేజా ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో బిజీగా ఉన్నాడు. ఈ సీజన్‌కు ముందు అనూహ్యంగా చెన్నై సూపర్ కింగ్స్ నుంచి రాజస్థాన్ రాయల్స్‌కు ట్రేడ్ అయిన జడేజా.. మైదానంలో తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 132 పరుగులు చేయడంతో పాటు 6 వికెట్లు పడగొట్టాడు. మైదానంలో ఆల్ రౌండ్ షో చూపిస్తున్నప్పటికీ, ఇంటి వద్ద సోదరి ఓటమి, కుటుంబ సభ్యుల మధ్య రాజకీయ వైరం జడేజాను కొంత ఇబ్బందికి గురిచేసే అంశాలేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999